RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

హైదరాబాద్ 21 జూలై 2025 సోమవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:46

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers



## బోనాలు అంటేనే తెలంగాణ సంస్కృతి

## దేవాలయాల అభివృద్ధికి 1,290 కోట్లు

### లాల్ దర్వాజా బోనాల ఉత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



బోనాలు అంటే తెలంగాణ సంస్కృతి. ఈ సంస్కృతిని అనాదిగా ఆచరిస్తూ వస్తున్న భక్తులందరికీ శుభాకాంక్షలు. బోనాల ఉత్సవాలను పెద్ద ఎత్తున జరుపుకుంటున్న సంగతి మనకందరికీ తెలిసిందే. గోల్కొండలో మొదలయ్యే ఈ బోనాలు ఉత్సవాలు సికింద్రాబాద్ నుంచి లాల్ దర్వాజాలో వెలసియున్న సింహవాహిని మహంకాళి అమ్మవారి దగ్గర వరకు జరుగుతున్న ఈ ఉత్సవాలను జరుగుతున్నాయి.

అత్యంత ప్రశాంతంగా భక్తి ప్రపత్తులతో నగరంలో ఈ ఉత్సవాలు కొనసాగడం ఆనందదాయకం.

ఈ రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం 1,290 కోట్ల నిధులను కామన్ గుడ్ ఫండ్ నుంచి విడుదల చేయడం జరిగింది.

హైదరాబాద్ మహానగరంలో జరిగేటువంటి బోనాల ఉత్సవాల కోసం 20 కోట్ల రూపాయల నిధులను ప్రత్యేకంగా విడుదల చేయడం జరిగింది.



ఎవరికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉద్యోగులు, సిబ్బంది, అత్యంత జాగరూకతతో వ్యవహరిస్తున్నారు. ఈ బోనాల ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహిస్తోంది నిర్వహిస్తోంది.

ఉత్సవాలు అత్యంత ప్రశాంత వాతావరణంలో జరగడానికి సహకరిస్తున్న భక్తులకు సిబ్బందికి ఉద్యోగులకు అభినందనలు.

రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈరోజు అమ్మవారికి పట్టు వస్త్రములు సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలని క్షేమంగా సుభిక్షంగా చూడాలని, ఈ సమాజాన్ని, మీ భక్తులని, విశ్వ మానవాళిని నీ చల్లని చూపులతో చల్లగా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారిని ప్రత్యేకంగా వేడుకోవడం జరిగింది.



లాల్ దర్వాజాలో వెలసిన సింహ వాహిని మహంకాళి అమ్మవారి చల్లని చూపులతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని రాష్ట్ర ప్రజలందరికీ తరపున అమ్మవారిని కోరుకోవడం జరిగింది.

ఈ ప్రాంతంలోని ఆలయాల అభివృద్ధి కోసం తగిన చర్యలు తీసుకుంటామని గతంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారన్న విషయాన్ని ఉపముఖ్యమంత్రి తెలిపారు. భవిష్యత్తులో మహంకాళి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తాం.ఖ



చారిత్రాత్మక గోల్కొండలో వెలసిన జగదాంబిక ఎల్లమ్మ తల్లికి ఆషాడ మాసం తొలి బోనం సమర్పించడంతో జంటనగరాల్లో మొదలైన బోనాల ఉత్సవాలు దేవాదాయ శాఖ, ఇతర శాఖల కృషి, పర్యవేక్షణతో నెల రోజుల పాటు జరిగిన బోనాల ఉత్సవాలు విజయవంతం కావడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక సంస్కృతికి ప్రతీక బోనాల పండుగ అన్నారు. ప్రకృతితో మమేకమై జీవించే వ్యవసాయ ఆధారిత సమాజ సాంప్రదాయ సామూహిక తాత్వికత, బోనాల పండుగ సందర్భంగా తెలంగాణ గడ్డమీద నుంచి ప్రపంచానికి ప్రదర్శితం అవుతుందన్నారు. తెలంగాణ సాంప్రదాయానికి అద్దంపట్టే బోనాల జాతరతో రాష్ట్రమంతటా ఆధ్యాత్మకత ఉట్టిపడిందన్నారు.

గోల్కొండలో మొదటి బోనంతో ప్రారంభమైన ఆషాఢ బోనాల జాతర లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారికి బోనం సమర్పించడంతో బోనాల ఘటం ముగుస్తుందన్నారు.

బోనాల ఉత్సవాలు విజయంతం కావడానికి కృషి చేసిన అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.

## చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని పట్టువస్త్రాలు సమర్పించిన

## మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి.



**చార్మినార్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు సందర్భంగా చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి అమ్మవారిని దర్శించుకొని పట్టువస్త్రాలు సమర్పించిన రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కామెంట్స్

హైదరాబాద్ జంట నగరాల ప్రజలకు బోనాల పండగ శుభాకాంక్షలు...

ప్రజలు అందరూ పాడి పంటలతో సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నా..

హైదరాబాద్ నగరంలో ఓల్డ్ సిటీ కి మెట్రో రాబోతుంది...

అమ్మధయ వల్ల ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతుంది..

బోనాలు అంటే ప్రపంచ వ్యాప్తంగా వినిపించే పేరు తెలంగాణ రాష్ట్రం అందులో హైదరాబాద్ నగరం...

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కో ఆలయానికి ఒక్కో మంత్రికి కేటాయించారు సంతోషం..

ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించి...ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేశాం.

## నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు- పహల్గాం దాడి, ట్రంప్ కామెంట్స్ పై మోదీ స్పందించాలి:అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాలు డిమాండ్



న్యూఢిల్లీ, జులై 20 పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు కేంద్ర ప్రభుత్వం ఆదివారం ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశంలో ప్రతిపక్షాలు బిహార్?లో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక పునర్విశ్లేషణ ప్రక్రియ (ఎస్ఐఆర్), పహల్గాం ఉగ్రదాడి, భారత్- పాక్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ గురించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు సహా పలు అంశాలను లేవనెత్తాయి. కేంద్ర మంత్రి, రాజ్యసభ నాయకుడు జేపీ నడ్డా అధ్యక్షతన జరిగిన ఈ అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, ఆప్, సహా పలు రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ క్రమంలో సభ సజావుగా సాగడానికి సహకరించాలని విపక్ష పార్టీలను కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.'ఆ అంశాలను ఆఖిలపక్ష సమావేశంలో లేవనెత్తాం'బిహార్?లో ఓటరు జాబితాల సవరణ (ఎస్ఐఆర్) తాలుక పోల్ స్కామ్, భారత్- పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యల గురించి వివరణ వంటి అంశాలను అఖిలపక్ష సమావేశంలో లేవనెత్తినట్లు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. ఇండియా కూటమి లోక్?సభ ఎన్నికలకు మాత్రమేనని, ఆప్ సొంతంగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

'ఆ అంశాలపై పార్లమెంట్?లో మోదీ ప్రకటన చెయ్యాలి'

పహల్గాం ఉగ్రదాడి, బిహార్?లో ఎస్ఐఆర్, భారత్- పాక్ మధ్య కుదిరిన కాల్పుల ఒప్పందంపై ట్రంప్ వ్యాఖ్యలు తదితర అంశాలను అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ లేవనెత్తిందని ఆ పార్టీ ఎంపీ గౌరవ్ గొగోయ్ తెలిపారు. కాంగ్రెస్ లేవనెత్తిన కీలక అంశాలపై ప్రధాని మోదీ పార్లమెంటులో ప్రకటన ఇవ్వాలని కోరామన్నారు.








**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో తెలంగాణా ఫిషారిస్ కో అపరేటీవ్ సోసైటీ ఛైర్మెన్ మెట్టు సాయి కుమార్ జన్మదినం సందర్భంగా మంగళ్‌హాట్ డివిజన్‌లో జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి నిర్వహించడం జరిగినది.గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు జన్మదినం ? శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజాబలం

**21 జూలై 2025 సోమవారం**


## మానవ హననం కాస్తా తగ్గుముఖం....

మావోయిస్టులు సాయుధ దళాల పంథామార్చుకున్నాయని వస్తున్న వార్తలలో నిజం ఎంతైనా ఉండవచ్చు! కానీ, చత్తీస్‌గఢ్‌లో సామూహిక మానవ హననం కాస్తా తగ్గుముఖం పట్టిన జాడలను బట్టి మనం నిర్ధారణకు వస్తున్నాము. ఎదురుదెబ్బ తగిలినప్పుడు ఏపార్టీనైనా తన వ్యూహాన్ని మార్చుకుంటుంది? అందునా విప్లవం పార్టీ అయిన మావోయిస్టు పార్టీ అందుకు మినహాయింపు కాదు. నష్టాలు తగ్గించుకోవడానికి పిఎల్‌జిఎను నలుగురైదుగురు దళాలస్థాయికి కుదించారని, కార్యకర్తలు, నాయకులు ప్రజల్లో కలిసి జీవిస్తున్నారనేది దాని సారాంశం. ఇది మావోయిస్టు కొత్త సిద్ధాంతం ఏమీకాదు! అర్ధవలస, –అర్ధభూస్వామ్య దేశంలో మావో అనుసరించిన ప్రాథమిక వ్యూహాత్మక విధానమే అది. గెరిల్లా పోరాటం! కాకుంటే, మావోయిస్టులే విప్లవ పరిపక్వ స్టేజీలో చేయాల్సిన పిఎల్‌జిఎ ఏర్పాటు ముందే చేయడం, మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎదుర్కొనే వ్యూహం లేకపోవడం మావోయిస్టు పార్టీ నష్టాలకు ప్రధానకారణం.

తాజా పరిస్థితిలోఅనేక మంది గిరిజనులు చనిపోతున్నారు! కనుక కేంద్రం తో చర్చలు జరుపుతామని ఒక అడుగు వెనక్కు వేసి నక్సలైట్లు ప్రకటించినా కేంద్రం తన పట్టు సడలించకుండా మావోయిస్టు పార్టీని వెంటాడి, వేటాడి చంపుతున్నది? అందుకు శత్రుదేశం మీద వాడిన విధంగా డ్రోన్లు, హెలికాప్టర్‌లు వాడుతుంది! ఇండో –పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కూడా దండకారణ్యంలో ఎన్‌కౌంటర్‌లను ఆపలేకపోయాయి? ఈ స్థితి ఏర్పడడానికి ప్రధాన కారణం కమ్యూనిస్టు వ్యతిరేక ఒక దృఢమైన అతివాద హిందూ సైద్ధాంతిక నిబద్ధత కలిగిన సంఘ్ పరివార్ ఎజెండా అమలు పరిచే శక్తులు కేంద్రంలో నిర్ణయాత్మక స్థానంలో, ముఖ్యంగా అధికారంలో ఉండడమే కారణం కావచ్చునేమో? కనీసం కనికరం, మానవత్వం లేని రక్తపాతాన్ని బహిరంగంగా చెప్పడం వెనుక ఆంతర్యం కూడా ప్రశ్నించే తత్వాన్ని హతమార్చే వ్యూహం తప్ప మరొకటి కాదు!

అయితే మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి మరణంలో కోవర్టు పాత్ర ఉందని, అనేక మరణాల వెనుక కోవర్టు పాత్రలు ఉన్నాయని బహిరంగంగా ప్రకటించిన మావోయిస్టు పార్టీ కోవర్టులు అనబడే సమస్యను గత యాభై ఏళ్ళుగా ఎందుకు అధిగమించలేకపోయిందనేది ప్రశ్నార్థకం? ఇన్నేళ్ళ పోరాటంలో ఇంకా ఇదో చిక్కు సమస్యే అయితే? ఎందుకు అధిగమించలేకపోయారనేది కొత్త పాఠం ఏమీ కాదు, పాత పాఠమే! ఇదే సమయంలో దేశంలో మావోయిస్టు ఆచరణకు ఏకైక గీటురాయిగా భావించిన జనతన సర్కార్, దండకారణ్యం విప్లవోద్యమం ఒడిదుడుకులకు లోనుకావడం అనేది.

దేశవ్యాప్తంగా సామాజిక, మౌలిక మార్పు, రాజకీయ ప్రత్యామ్నాయం కోరుకుంటున్నా సామాన్య ప్రజలకు ఈ దండకారణ్యం పరిణామాలు నిరాశ, నిస్పృహ పర్చాయనడంలో సందేహం లేదు! ఇక మావోయిస్టు సిద్ధాంతం అనుసరించే శ్రేణులు కూడా తమ సైద్ధాంతిక పునాది మారకపోయినా! ఎత్తుగడలు, పోరాట వ్యూహాలు అమలులో మార్పులు, చేర్పులు గురించి ఆత్మసమీక్ష ఇప్పటికైనా అవసరమే? యాభైఏళ్ళు పైబడిన నక్సలైట్ ఉద్యమం ఎందుకు ఇంకా తప్పటడుగులు వేస్తుంది? మావోయిస్టు సైద్ధాంతిక నేపథ్యం స్వీకరించిన వారిలో ఎందుకు ఇన్ని, వైవిధ్యాలు, గ్రూపులు ఉన్నాయి? నక్సలైట్లు, ప్రజల త్యాగాలను దండకారణ్యం పరిణామాల నేపథ్యంలో ఒక్కసారి సమీక్షించుకుంటే!

భూసమస్య కేంద్రంగానే నక్సలైట్ ఉద్యమం అంకురార్పణ జరిగింది. 1969లో నక్సల్బరీ ఉద్యమం, దాని మార్గదర్శకంలో వచ్చిన శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటాన్ని ఆనాటి ప్రభుత్వం ఎన్‌కౌంటర్స్ ద్వారా ముఖ్యనేతలను హతమార్చడం ద్వారా అణచివేశారు. ఇక నక్సలైట్ ఉద్యమం తెలంగాణలో గోదావరి లోయలో గిరిజనుల పోడుభూముల ఉద్యమం, సిరిసిల్ల, జగిత్యాల భూస్వామ్య వ్యతిరేక పోరాటంగా ముందుకు వచ్చింది. అటు తర్వాత ఆ ఉద్యమాలు రక్తపుటేరులు పారించి పాలకులు అణచివేతకు గురిచేశారు. తెలంగాణ రాష్ట్రంలో నక్సలైట్ ఉద్యమం ముక్కచెక్కలుగా మారి ప్రస్తుతం సిపిఐ ఎంఎల్ పేరుతో అనేక గ్రూపులు మనుగడ సాగిస్తున్నాయి. ఇల్లెందు, సిరిసిల్లలో ఆయా గ్రూపులు తెలుగు రాష్ట్రంలో శాసనసభలో కూడా ప్రవేశించారు. తెలంగాణలో చైతన్యం పొందిన మావోయిస్టులు, ఉన్నత విద్యావంతులు దండకారణ్యం కేంద్రంగా పనిచేసి ఓ సాయుధ క్యారిడార్ నిర్మాణానికి అంకురార్పణ చేశారు.

గత 30 ఏళ్ళుగా నక్సలైట్ ఉద్యమం చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా, బీహార్, బెంగాల్ రాష్ట్ర దండకారణ్యంలో గిరిజన ప్రజలను సమీకరించి మధ్య భారతంలో ఓ బలమైన విప్లవోద్యమం నిర్మాణానికి పునాదులు వేశారు. అంతేకాదు మావోయిస్టు సిద్ధాంతం అమలు మోడల్‌గా దండకారణ్యంలో ప్రజల ప్రత్యామ్నాయ ప్రభుత్వం పేరుతో జనతన సర్కార్ ఏర్పరిచారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్‌జిఎ) ప్రారంభించారు. వేలమంది త్యాగాలతో నిర్మితం అయిన ఉద్యమం అణచివేతకు గురై ప్రశ్నార్థకంగా మిగిలింది. ఇప్పుడు నక్సలైట్ ఉద్యమం పరిణామాలు గమనించిన ప్రజలకు కొన్ని ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. 1949లో ఆనాటి చైనా పరిస్థితి కనుగుణంగా రూపొందించిన గెరిల్లావార్ వ్యూహం అమలు, రవాణా సౌకర్యాలు ర్యాపిడ్‌గా మారిన, సాంకేతిక పరిజ్ఞానం చాలా వేగంగా విస్తరించిన ఈ దశలో ఎంతవరకు సబబు? సాయుధ పోరాట సంకల్పం కాలానుగుణంగా ఉందా? లేదా? నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరి లోయ, ఇప్పుడు దండకారణ్యం నేర్పుతున్న పాఠాలు, గుణపాఠాలు ఇప్పుడైనా మావోయిస్టులు సమీక్షించుకోవాలసిన అవసరం ఉంది. ఒకవైపు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి భారత సైన్యం పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలు, మిలిటరీ స్థావరాలు కొన్ని నిమిషాల వ్యవధిలో ధ్వంసం చేశాయి. ఇలాంటి ఆధునిక భారత సైన్యాన్ని దండకారణ్యంలో మావోయిస్టుల అణచివేతకు పెద్దఎత్తున కేంద్రం ఉపయోగిస్తున్నప్పుడు కేవలం తమ దగ్గర ఉన్న తుపాకులతో ప్రజల రక్షణ సరే! తమను తాము కాపాడుకునే స్థితి లేదు? 30 ఏళ్ళుగా అనేక ఒడిదుడుకులు, అష్టకష్టాలుపడి నిర్మించిన ఉద్యమం కళ్ళ ముందే కుప్పకూలుతుంటే? ఆచరణ, అనుభవాలు నుండి మావోయిస్టులు పాఠాలు తీసుకోవాల్సిన అవసరం ముందుకు వచ్చింది.

మార్క్సిజం గురించి, మావోయిస్టుల గురించి మాలాంటి వారు మాట్లాడడం హాస్యాస్పదం అనిపించినా అనిపించవచ్చు? కానీ, మార్క్సిజం జడపదార్థమో? పిడి వాదమో? కానేకాదు! పరిస్థితి కనుగుణంగా మార్చుకోవాలసిన సంకేతాలు ఇచ్చే నిత్యనూతన సిద్ధాంతం? ఇప్పటికీ ప్రపంచాన్ని అంతగా ప్రభావితం చేసిన సామాజిక సిద్ధాంతం లేనే లేదు? మరి మావోయిస్టులు తమ సైద్ధాంతిక పునాది కనుగుణంగా ప్రస్తుత పరిస్థితి కనుగుణంగా మారతారా? లేక పాత సిద్ధాంత పునాది వీడేది లేదని ప్రకటిస్తారా? అనేది వారివారి ఇష్టం. కానీ ప్రజల ప్రయోజనాలు కాంక్షించే మనం కూడా ప్రజల్లో అంతర్భాగం అనే ప్రాథమిక సూత్రం మాత్రం వారికీ వర్తిస్తుంది! నక్సలైట్ల త్యాగాలను అర్థం చేసుకుంటే వారి నైతికతను, పట్టుదలనూ, సైద్ధాంతిక నిబద్ధతనూ ఎవరూ తప్పుపట్టలేరు సరికదా! విస్తరిల్లుతున్న అవకాశవాద రాజకీయాల ఊబిని చూస్తున్నప్పుడు, నూటికి నూరు శాతం నిజాయితీకి నిలువుటద్దం మావోయిస్టులే కనిపిస్తారు!

అయితే, మారుతున్న కాల, మాన పరిస్థితుల్లో మావోయిస్టు త్యాగాలు నేర్పుతున్న పరమార్థం ఏమిటి? సందేశం ఏమిటి? త్యాగాలకు కొన్ని పరిమితులు అవసరమే కదా? ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అబివృద్ధి చెందుతున్న ఈ దశలో అందుకనుగుణంగా మావోయిస్టులు వ్యూహం, ఎత్తుగడలలో, సైద్ధాంతిక ఆచరణీయ స్థితిలో ఉన్న పరిమితులను దృష్టిలో పెట్టుకొని ఆలోచించాల్సిన అవసరం ముందుకు వచ్చింది. పాలకులు కూడా మావోయిస్టులు ఒక అడుగు వెనక్కువేసి చర్చలు కోరుకున్నప్పుడు ఇంత పాశవికంగా, ఆటవికంగా హతమార్చవలసిన అవసరం లేదు?

## సామాజిక ఐక్యతకు బ్రహ్మకుమారీల కృషి గొప్పది?

### శాంతి స్థాపనలో పీఆర్ ప్రతినిధులు కీలకం

### పబ్లిక్ రిలేషన్స్ రాష్ట్ర సదస్సులో వక్తల పిలుపు










హైదరాబాద్: సమాజంలోని వివిధ వర్గాల మధ్య ఐక్యత, విశ్వసనీయత పెరిగినప్పుడే శాంతిపూర్వకమైన అభివృద్ధి సాధ్యమవుతుందని వక్తలు పిలుపునిచ్చారు. సామాజిక ఐక్యతను పెంచడానికి బ్రహ్మ కుమారీలు కుల మతాలకు అతీతంగా చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఆదివారం బీబీనగర్ సమీపంలోని బ్రహ్మ కుమారీస్ సైలెన్స్ రిట్రీట్ సెంటర్లో పబ్లిక్ రిలేషన్స్ మీద రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది.

?ఈ సదస్సులో తెలుగు రాష్ట్రాలు, జంట నగరాల నుంచి పీఆర్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్లోబల్ పబ్లిక్ రిలేషన్స్ ఫోరం, బ్రహ్మ కుమారిస్ సంయుక్త ఆధ్వర్యంలో " శాంతి, ఐక్యత, విశ్వసనీయత కోసం పబ్లిక్ రిలేషన్స్" అంశం మీద సెమినార్ నిర్వహించారు.

పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్ ముఖ్యఅతిథిగా ప్రసంగిస్తూ ప్రపంచ దేశాల మధ్య, సమాజంలోని వర్గాల మధ్య, కుటుంబంలోని వ్యక్తుల మధ్య విశ్వసనీయత లోపించినప్పుడు అశాంతి ఏర్పడుతుందని, ఇలాంటి తరుణంలో ఆధ్యాత్మికత ద్వారా పాజిటివిటీని పెంచితే శాంతి, సామరస్యత నెలకొంటాయని అన్నారు.?పబ్లిక్ రిలేషన్స్ ప్రతినిధుల్లో నైతికత, విశ్వసనీయత ఉన్నప్పుడు వృత్తి లో రాణించగలుగుతారని పాఠక్ చెప్పారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రపంచం మొత్తం వసుదైవ కుటుంబం అనే భావనతోనే పని చేస్తోందని, బ్రహ్మకుమారీలు కూడా ఇదే లక్ష్యంతో కృషి చేస్తుండటం అభినందనీయమని అన్నారు.

?సదస్సుకు నేతృత్వం వహించిన బ్రహ్మ కుమారిస్ మీడియా వింగ్ వైస్ చైర్ పర్సన్ బి. కె.సరళ మాట్లాడుతూ పీఆర్ ప్రతినిధులు వృత్తిలో ఆధ్యాత్మిక, నైతిక విలువలను జోడించినట్లయితే సమాజంలో ఐక్యత, సామరస్యత ప్రశాంతత వృద్ధి చెందుతాయని చెప్పారు. ప్రభుత్వ లేదా ప్రైవేటు సంస్థల్లోని అన్ని విభాగాల మధ్య ప్రేమపూర్వక సంబంధాలను నెలకొల్పటంలో పబ్లిక్ రిలేషన్స్ ప్రతినిధులు కీలక పాత్ర పోషిస్తారని,వీరు వ్యక్తిగత స్థాయిలో శాంతిని కలిగి ఉన్నప్పుడే సంస్థలో కూడా శాంతిపూర్వకమైన అభివృద్ధిని చూడగలుగుతారని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా రాజయోగ శిక్షణ ద్వారా బ్రహ్మకుమారీస్ ప్రత్యక్షంగా శాంతిని నెలకొల్పే సేవలు అందిస్తున్నారని, అందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

?పబ్లిక్ రిలేషన్స్ వాయిస్ సంపాదకుడు వై.బాబ్జి మాట్లాడుతూ టెక్నాలజీ, కృత్రిమ మేథ కారణంగా మానవ సంబంధాలు తగ్గిపోతున్న ప్రస్తుత తరుణంలో సమాజంలోని వ్యక్తుల్లో, వ్యవస్థల్లో శాంతిని పెంపొందించే బాధ్యత పీఆర్ ప్రతినిధుల పై ఉందన్నారు. బ్రహ్మకుమారీలు నేర్పే రాజయోగ ధ్యానం వృత్తిలో ఎదురయ్యే అన్ని రకాల సవాళ్లను పరిష్కరించే సమర్థతను పెంచుతుందని, ఆధ్యాత్మిక రంగంలో బ్రహ్మ కుమారీల సేవలు సాటిలేనివని చెప్పారు.

?ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యుడు లక్ష్మణ్ మాట్లాడుతూ యుద్ధాలు జరుగుతున్న దేశాల్లో కూడా బ్రహ్మ కుమారీస్ శాంతిని పెంచే సేవలు అందిస్తున్నారని కొనియాడారు. నిరంతరం ఒత్తిడితో నిండిన మీడియా, పీఆర్ రంగంలోని వ్యక్తులకు బ్రహ్మకుమారీల శిక్షణ అద్భుతంగా సహాయపడుతుందని చెప్పారు.

?సమాజంలో సవాళ్లు, సంక్లిష్టతలు పెరుగుతున్న తరుణంలో శాంతి సామరస్యతలను కాపాడే కీలకమైన బాధ్యత పీఆర్ రంగంపై ఉందని బ్రహ్మ కుమారిస్ మీడియా వింగ్ చైర్మన్ రాజయోగి బి. కె. కరుణా భాయ్ మౌంట్ అబూ నుంచి ఆన్ లైన్ ద్వారా మాట్లాడారు.

?సైలెన్స్ రిట్రీట్ సెంటర్ డైరెక్టర్లు బి.కె. రాజకుమారీ ప్రాక్టికల్ ధ్యానం అనుభూతి చేయించగా, బి.కె. సునీత పీ.ఆర్.ఓలు పాజిటివిటీ లేదా పరమాత్మ రిలేషన్ ఆఫీసర్స్ గా భావించుకుంటే శాంతిని పెంపొందించగలరని సూచించారు.

?పీఆర్ రంగంలో అత్యుత్తమ సేవలకుగాను బ్రహ్మ కుమారీస్ అందించే గోల్డెన్ ట్రయాంగిల్ పురస్కారాలను అజిత్ పాఠక్, బాబ్జి అందుకున్నారు.

?ఈ కార్యక్రమంలో హిందీ మిలాప్ చీఫ్ ఎడిటర్ ప్రకాష్ జైన్, పీఆర్ఎస్ఐ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ గిరి, తెలంగాణ అఫ్ సెట్ ప్రింటర్స్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, అనింది త ముఖర్జీ, బి. కె. నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు రూ.40 వేలు ఖర్చయ్యే డ్రోన్ పైలట్ శిక్షణ ఉచితం



హైదరాబాద్, జులై 20 మహిళా సాధికారత కోసం దుర్గాబాయి మహిళాశిశు వికాస కేంద్రం కృషి – భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లోని స్త్రీలకు ఉచితంగా డ్రోన్?పైలెట్ శిక్షణ – డ్రోన్ల ద్వారా అతివలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయంటున్న నిపుణులు డ్రోన్ల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ఎకరం పొలాన్ని ఒక డ్రోన్?తో 15 నిమిషాల్లో పురుగుల మందులను పిచికారి చేయవచ్చు. ఇందుకు రూ.500 ఖర్చవుతుంది. మనుషులకు ఎక్కువ సమయం పడుతుంది. పైగా రూ.1,200 వరకు వెచ్చించాల్సి వస్తుంది. గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువతులకు శిక్షణ అందిస్తే వారు తమ వ్యవసాయ పనులకు డ్రోన్లు ఉపయోగించుకోవచ్చు లేదా డ్రోన్లను అద్దెకు ఇవ్వటం ద్వారా ఆదాయం పొందవచ్చు.

యాంత్రీకరణ ద్వారా మహిళా సాధికారత కోసం ఖమ్మంలోని దుర్గాబాయి మహిళాశిశు వికాస కేంద్రం కృషి చేస్తోంది. మహిళా ప్రాంగణంలోని ఈ కేంద్రం వద్ద ఈ నెల 7 నుంచి భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లోని స్త్రీలకు ఉచితంగా డ్రోన్ పైలెట్ శిక్షణ ఇప్పిస్తోంది. ప్రస్తుతం మొదటి బ్యాచ్‌కు తర్ఫీదు కొనసాగుతోంది. కాగా బయట ఐదు రోజుల పైలెట్ కోర్సుకు సుమారు రూ.40 వేలు ఖర్చవుతుంది.

మహిళలకు డ్రోన్ పైలెట్ శిక్షణ : ఖమ్మం ప్రభుత్వ ఐటీఐలో అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్(ఏటీఓ)గా పనిచేస్తున్న కుదురుపాక సాయినరేష్‌బాబు హైదరాబాద్ షేక్‌పేట్‌లోని ఇండియా డ్రోన్ అకాడమీలో పైలెట్‌గా శిక్షణ తీసుకున్నారు. పదేళ్ల లైసెన్స్ పొందిన ఈయన మహిళలకు డ్రోన్ పైలెట్ శిక్షణ ఇస్తున్నారు. వ్యవసాయానికి వాడే ఎక్సాకాంప్టర్ డ్రోన్‌తో పాటు ఇతర రకాలు, బ్యాటరీలు, సెన్సార్ల గురించి చెబుతున్నారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నిబంధనలు, లైసెన్స్ తీసుకోవటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. రెడ్, ఎల్లో, గ్రీన్ జోన్ల గురించి చెబుతూనే ఎలా, ఎక్కడ ఎగురవేయాలో మహిళలతో ప్రాక్టీసు చేయిస్తున్నారు.

డ్రోన్ వినియోగంపై మెలకువలు : పురుగుమందుల పిచికారి, మొక్కల ఎదుగుదల, భవన నిర్మాణ పనుల పరిశీలన, వస్తువుల రవాణా(కార్గో), భూసర్వే, అడవిలో తప్పిపోయిన వారిని వెతకటం, వాతావరణ పరిరక్షణ, మిలిటరీ, ప్రజల సంరక్షణ, అత్యవసర సమయాల్లో స్పందన, డ్రోన్ ఫొటోగ్రఫీ, స్థిరాస్తి వ్యాపారం, వాణిజ్య అవసరాలు, త్రీడీ మ్యాపింగ్, ఏరియల్ ఫొటోగ్రఫీలో డ్రోన్ వినియోగంపై మెలకువలు నేర్పుతున్నారు.అదనంగా ఆదాయం : 'మాకు మూడెకరాల భూమి ఉంది. మా తమ్ముడికి చెందిన 15 ఎకరాలను కౌలుకు తీసుకున్నాం. దానిలో వరి, మొక్కజొన్న, కూరగాయలు సాగుచేస్తున్నాము. కూలీలు దొరక్క, కూలీ రేట్లు పెరగటంతో భార్యాభర్తలం ఇద్దరం పొలంలోనే పనిచేస్తూ ఇబ్బందులు పడేవాళ్లం. కాగా ఈ మధ్యనే డ్రోన్‌తో వేగంగా పనులు చేయవచ్చని తెలుసుకున్నాం. ఆపై వాటిని అద్దెకు ఇవ్వడం ద్వారా అదనంగా ఆదాయాన్నికూడా పొందవచ్చు' అని కందుకూరుకు చెందిన నందికోల సునీత అన్నారు.

మహిళలకు రాయితీపై డ్రోన్లు : పంటలపై రసాయనాల పిచికారి సమయంలో రైతులు అనారోగ్యానికి గురవుతున్నారని మహిళా ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేత తెలిపారు. ఈ ముప్పును తప్పించేందుకు డ్రోన్లను వినియోగించవచ్చు అని అన్నారు. అందుకే డ్రోన్ల పనితీరుపై మహిళలకు శిక్షణ ఇప్పిస్తున్నామని చెప్పారు. కలెక్టర్ సహకారంతో మహిళలకు రాయితీపై డ్రోన్లు ఇప్పించాలని యోచిస్తున్నామని వివరించారు. డ్రోన్ల ద్వారా అతివలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు.

వేల్పుల విజేత, మహిళా ప్రాంగణం మేనేజర్ మాట్లాడుతూ:

"పంటలపై రసాయనాల పిచికారి సమయంలో రైతులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ ముప్పును తప్పించేందుకు డ్రోన్లను వినియోగించవచ్చు. అందుకే డ్రోన్ల పనితీరుపై మహిళలకు శిక్షణ ఇప్పిస్తున్నాం. కలెక్టర్ సహకారంతో మహిళలకు రాయితీపై డ్రోన్లు ఇప్పించాలని యోచిస్తున్నాం. డ్రోన్ల ద్వారా అతివలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి."

# రేడియో ఆవిష్కర్త మార్కొనీ
# జూలై 20... గుగ్లి ఎల్మో మార్కొని వర్ధంతి



ప్రస్తుతం ప్రతి ఇంటిలో ఇప్పుడు టివి ఉన్నట్లే కొంత కాలం క్రితం ప్రతి ఇంటిలో రేడియో సెట్ ఉండేది. నాడు ప్రధాన మనో రంజన సాధనాల్లో రేడియో ప్రధాన మైనది. రేడియో పేరు తీయగానే గుర్తుకు వచ్చేది దాని ఆవిష్కర్త మార్కోనీయే. గుగ్లి ఎల్మో జియోవన్ని మారియా మార్కోనీ (1874 ఏప్రిల్ 25 - 1937 జూలై 20) ఇటాలియన్ ఆవిష్కర్త, ఎలక్ట్రికల్ ఇంజనీర్. అతను సుదూర ప్రాంతాలకు రేడియో ప్రసారాలు పంపుటకు, రేడియో టెలిగ్రాఫ్ వ్యవస్థను అభివృద్ధి చేయుటలో పితా మహుడుగా గుర్తింపు పొందాడు. అతను రేడియో యొక్క ఆవిష్కర్త. 1909 లో కార్ల్ ఫెడ్రినాండ్ బ్రాన్ తో కలసి వైర్?లెస్ టెలిగ్రాఫీ అనే అంశంపై భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి తీసుకున్నాడు. 1897 లో బ్రిటన్ లో వైర్?లెస్ టెలిగ్రాఫ్, సిగ్నల్ కంపెనీకి వ్యవస్థాపకునిగా ఉన్నాడు. అతను ఇతర భౌతిక శాస్త్రవేత్తల ప్రయోగాలను ఆధారంగా చేసుకొని రేడియో అనే కొత్త ఆవిష్కరణ చేసి వ్యాపార రంగంలో ఘనమైన విజయాన్ని సాధించాడు.

రేడియో అనేది విద్య స్థాయి, సామాజిక, ఆర్థిక స్థితి, లింగం వయస్సుతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి చేరే మాస్ మీడియా. కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాడ్యులేషన్ చేయటం ద్వారా తీగల ఆధారము లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేయు ప్రక్రియను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. సమాచారాల చేర వేత కోసం గతంలో చాలామంది చేసిన ప్రయోగాలన్నీ మార్కోనీ పరిశోధనలకు దోహద పడ్డాయి.

మార్కోని 1874 ఏప్రిల్ 25 లో ఇటలీ దేశంలోని బొలొగ్నాలో అన్నీ జేమ్?సన్, గుసెప్ మార్కోనీ దంపతులకు జన్మించాడు. విద్యార్థి దశలో మార్కోనీ పరిశోధనల పట్ల మక్కువ చూపించేవాడు. తన తల్లిదండ్రులచే నియమించబడిన ప్రైవేట్ ఉపాధ్యాయుల నుండి ఇంట్లో రసాయనశాస్త్రం, గణితం, భౌతిక శాస్త్రాలను నేర్చుకున్నాడు.

లివోర్నోలోని ఉన్నత పాఠశాల భౌతిక ఉపాధ్యాయుడు ప్రొఫెసర్ విన్సెంజో రోసా 17 ఏళ్ల మార్కోనీకి భౌతిక దృగ్విషయాల ప్రాథమిక విషయాలను, అలాగే విద్యుత్తుపై కొత్త సిద్ధాంతాలను నేర్పించాడు. 18 యేళ్ళ వయస్సులో అతను తిగిరి బోలోగ్నాకు తిరిగి వచ్చాడు.

1890 ల ప్రారంభంలో, అతను "వైర్‌లెస్ టెలిగ్రాఫీ" అనే ఆలోచనపై పనిచేయడం ప్రారంభించాడు, అంటే ఎలక్ట్రిక్ టెలిగ్రాఫ్ ఉపయోగించిన వైర్లను కనెక్ట్ చేయకుండా టెలిగ్రాఫ్ సందేశాలను ప్రసారం చేయడం. బోలోనా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రీగ్ అధ్వర్యంలో ఇరవయ్యేళ్ళ యువకుడు మార్కోనీ కొన్ని నెలల పాటు కృషి చేశాడు. తల్లిదండ్రులతో బాటు నివసిస్తున్న తన ఇంటి పై అంతస్తు లోనే అతని ప్రయోగశాల ఉండేది. 1888 లో, విద్యుదయస్కాంత వికిరణాన్ని ఉత్పత్తి చేయగలవచ్చునని, గుర్తించగలమని నిరూపించాడు.

ఒకరోజు అర్థరాత్రి సమయంలో తల్లిని నిద్రలేపి ఓ తమాషా చూపిస్తానని పైకి తీసుకెళ్ళాడు. ఒకచోట మోర్స్ కీ 12 అడుగుల దూరంలో ఎలక్ట్రిక్ బెల్ ని అమర్చాడు. కీని నొక్కినప్పుడల్లా గంట మోగడం ప్రారంభించింది. మధ్యలో తీగలు లేకపోయినా గంట మోగటం ఆశ్చర్య పరిచింది. వైర్ లెస్ విధానం ద్వారా తొలి సంకేతాన్ని ప్రసారం చేసిన ఈ ప్రయోగం గొప్ప చారిత్రాత్మక సంఘటన అని చాలాకాలం తరువాత మార్కోనీ తల్లి గ్రహించ గలిగింది.

మార్కోనీ క్రమంగా సంకేతాలు వెళ్ళగలిగే దూరాన్ని పెంచుతూ పోయాడు. ఓ చిన్న గుట్ట ఆవలిపైపు దాకా సంకేతాలు వెళ్ళగలిగాయి. సంకేతం ఆవలి వైపున చేరగానే దాన్ని గుర్తించానని తెలియ జేయడానికి గాను ఆయన తమ్ముడు గుట్టపై నిలబడి నాట్యం చేసేవాడు.

క్రమంగా సంకేతాలను ఎక్కువ దూరం ప్రసరించేలా చేయడంలో మార్కోనీ కృతకృత్యు డయ్యాడు. 1898 వేసవిలో సముద్ర మధ్యంలో జరిగిన పడవ పందేల గురించి ఎప్పటికప్పుడు వార్తలు పంపడానికి డబ్లిన్ వార్తా పత్రిక మార్కోనీని నియమించింది. ఆయన సముద్ర తీరంలో గ్రాహకాన్ని అమర్చి, వైర్ లెస్ ప్రసారిణిని ఓ పడవలో ఉంచుకొని బయలు దేరాడు. వార్తలను వైర్ లెస్ ద్వారా సముద్ర తీరానికి పంపితే, అక్కడి నుంచి వార్తా పత్రిక కార్యాలయానికి టెలిఫోన్ ద్వారా చేర వేశారు. వైర్ లెస్ ద్వారా పంపబడిన మొట్టమొదటి పత్రికా వార్త ఇదే.

వేల్స్ రాకుమారుడు ఒకసారి విహార నౌకలో వెడుతూ వైట్ దీవుల కావల జబ్బు పడ్డాడు. కుమారుని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటి కప్పుడు తెలుసు కోవాలని విక్టోరియా రాణి సంకల్పించింది. వెంటనే మార్కోనీని అభ్యర్థించగా అతడు వైర్ లెస్ పరికరాలను నెలకొల్పి, 16 రోజుల పాటు నిర్విరామంగా వార్తలను చేరవేసే ఏర్పాటు చేశాడు. మొత్తం 150 టెలిగ్రాంలు అటూ, యిటూ ప్రసారం చేయబడ్డాయి. 1909 లో రెండు పడవలు సముద్ర మధ్యంలో ఢీ కొన్నాయి. వైర్ లెస్ ద్వారా తీరానికి సమాచారం వెంటనే అందించక పోయి ఉంటే 1700 మంది ప్రయాణీకులు మునిగిపోయే వారు. 1912 ఏప్రిల్ లో టైటానిక్ అనే ఓడ సముద్ర మధ్యంలో ఓ మంచు కొండను ఢీకొంది. ఓడ మునిగి పోతుండగా అక్కడి ఆపరేటర్ వైర్ లెస్ ద్వారా %జూూ% సంకేతాలను అనేక సార్లు పంపించాడు. ఫలితంగా 700 మందిని రక్షించటానికి వీలైంది.

1907 లో బ్రిటిష్ నావికాదళానికి చెందిన ఓడలు ప్రపంచ పర్యటన చేస్తున్న సందర్భంగా జాతీయ గీతం వాద్యాలాపనను ఒక ఓడ నుండి మరో ఓడకి ప్రసారం చేసుకో గలిగారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధనౌకకు వైర్ లెస్ ద్వారా మార్కోనీ సందేశం పంపించ గలిగాడు.

మార్కోనీ రేడియో ప్రసారానికి సంబంధించిన పరిశోధనల్ని అవిశ్రాంతంగా కొనసాగించాడు. లిస్బన్ వద్ద సముద్ర తీరంలో వైర్ లెస్ పరికరాల్ని అమర్చి 300 మైళ్ళ దూరం దాకా సంభాషణల్ని ప్రసారం చేయగలిగాడు. కొన్ని నెలల లోపే ప్రపంచంలో కెల్లా తొలి ప్రసార కేంద్రం (%ఎతీశ్రీఱఎ ఖుర్‌అఅన్ర ర్ఫ్‌అశీఅ%) పిట్స్ బర్గ్ లో స్థాపించ బడింది. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యాడన్న వార్తను తొలి ప్రసారంలో ప్రకటించటంతో 1920 నవంబరు 2 వ తేదీన కార్యక్రమాలు ప్రారంభ మైనాయి.

1922 మే నెలలో 100 వాట్ల సామర్థ్యం గల రేడియో ప్రసార కేంద్రాన్ని లండనులో స్థాపించారు. 1922 నవంబరులో బ్రిటనులో ప్రసార హక్కులు గల ఏకైక సంస్థ బి.బి. సి. నవంబరు 14 నుంచి లండను కేంద్రం రోజువారీ ప్రసారాలు ప్రారంభించింది. అమెరికా బెల్ టెలిఫోన్ ప్రయోగ శాలల్లో పనిచేసే పరిశోధక బృందం తొలి ట్రాన్సిస్టర్ 1948 లో తయారు చేసింది. బాంబే ప్రెసిడెన్సీ రేడియో క్లబ్, ఇతర రేడియో క్లబ్‌ల కార్యక్రమాలతో బ్రిటిష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది. 1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది: 1927 జూలై 23 న ప్రారంభమైన బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభమైంది. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తిలోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది.

# చంద్రుణి చేరిన మానవ గమనం

## అంతర్జాతీయ చంద్ర దినోత్సవం: మానవ విజ్ఞాన యాత్ర సఫలం
## జూలై 20...అంతర్జాతీయ చంద్ర దినోత్సవం




చంద్రుడు అనగానే ప్రతి భారతీయుడి మనస్సులోనూ చందమామ కథలు, శిశువులకు చెప్పే లోక గీతాలు, కవిత్వపు ఊహలు, పౌరాణిక సందర్భాలు వెంటనే గుర్తుకొస్తాయి. కానీ శాస్త్రీయ దృష్టిలో చంద్రుడు మానవ జిజ్ఞాసకు, సాంకేతిక సామర్థ్యానికి అసాధారణ పరీక్షా కేంద్రంగా నిలిచాడు. ఖగోళ పరిజ్ఞానానికి ఒక మలుపు తిప్పిన ఘట్టం, మానవజాతి కలలకూ, సంకల్పాలకూ నిత్య గుర్తుగా నిలిచి పోయింది. 1969 జూలై 20న అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా చేపట్టిన అపోలో-11 మిషన్ విజయ వంతంగా చంద్రునిపై మానవ తొలి అడుగును ముద్రించింది. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రునిపై అడుగుపెట్టిన మొదటి వ్యక్తిగా చరిత్రలో నిలిచాడు. అతడు పలికిన "ఇది మనిషికి ఒక చిన్న అడుగు, మానవాళికి ఒక పెద్ద గంతు" అనే మాటలు శతాబ్దాలుగా శాస్త్రీయ పరిశోధనలకు మైలు రాళ్లుగా నిలిచాయి. ఆర్బిటర్‌లో మైఖేల్ కాలిన్స్ ఉండగా, బజ్ ఆల్డ్రిన్ కూడా చంద్రుడిపై నడిచిన రెండో వ్యక్తి అయ్యాడు. అపోలో 11 మిషన్ మొత్తం 8 రోజులు, 3 గంటలు, 18 నిమిషాల పాటు కొనసాగింది. దీని విజయంతో ప్రపంచం మొత్తం ఆశ్చర్య పోయింది. టెలివిజన్ తెరల, రేడియోల ముందు కోట్లాది మంది ఆ క్షణాన్ని కన్నీటి ఆనందంతో చూశారు, విన్నారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ జూలై 20ను అంతర్జాతీయ చంద్ర దినోత్సవంగా అధికారికంగా గుర్తించి, అంతరిక్షం పట్ల శాంతియుత ప్రయోగాలు, సాంకేతిక సహకారం, శాస్త్రీయ విజ్ఞానం పట్ల మానవతా బాధ్యతను తెలియ జేసింది. ఈ దినోత్సవం ద్వారా మానవ విజ్ఞాన గమనాన్ని గుర్తు చేసుకోవడంతో పాటు భవిష్యత్తులో అంతరిక్షంలో మానవ ప్రస్థానం ఎలా ఉండబోతుందో పట్ల చర్చలకు, ప్రేరణలకు అవకాశం కలుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలోని ఖగోళ పరిశోధనా సంస్థలు, విద్యా సంస్థలు, ప్లానెటోరియంలు, అంతరిక్ష కేంద్రాలు ఈ రోజున వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ, చంద్రునిపై జరిగిన తొలి మిషన్ విజయాన్ని గుర్తుచేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. భారత దేశం కూడా చంద్ర అన్వేషణలో విశేషమైన పాత్ర పోషిస్తోంది. ఇస్రో చేపట్టిన చంద్రయాన్-1 మిషన్ 2008లో చంద్రునిపై నీటి ఆనవాళ్లు గుర్తించింది. ఇది ప్రపంచ ఖగోళ శాస్త్రవేత్తలకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ తర్వాత 2019లో చంద్రయాన్-2 ద్వారా మరింత మెరుగైన టెక్నాలజీతో ల్యాండర్ పంపించగా, చివరిదశలో ల్యాండింగ్ విఫలమైనప్పటికీ ఆర్బిటర్ విజయవంతంగా పనిచేసి శేష గగనచార ప్రణాళికలకు మార్గదర్శిగా నిలిచింది. 2023లో చంద్రయాన్-3 విజయవంతంగా చంద్రునిపై దక్షిణ ధృవ ప్రాంతంలో ల్యాండింగ్ చేసి భారత ఖగోళ విజ్ఞానానికి ఒక చరిత్రాత్మక ఘట్టాన్ని చేర్చింది. భారత్ చంద్రునిపై విజయవంతంగా ల్యాండింగ్ చేసిన నాలుగో దేశంగా గర్వించదగిన స్థాయికి ఎదిగింది. ప్రస్తుతం చంద్రునిపై నాసా, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ, చైనా స్పేస్ ప్రోగ్రామ్, జపాన్, ఇస్రో వంటివి మానవ అన్వేషణకు సిద్ధమవుతున్నాయి. నాసా చేపట్టిన ఆర్టెమిస్ మిషన్ ద్వారా మళ్లీ మానవులను చంద్రునిపై పంపించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. చంద్రునిపై శాశ్వత స్థావరాలు, నీటి వనరులు, జీవవాస పరిస్థితులపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. భవిష్యత్ మానవ అంతరిక్ష ప్రయాణాల కోసం చంద్రుడు ప్రయోగశాలగా మారబోతున్నాడు. అంగారక గ్రహంపై మానవ యాత్రకు పునాది కూడా చంద్రుడే కానుంది. చంద్రుడు కేవలం ఒక ఖగోళ వస్తువు కాదు. మానవతా కలల ఆకృతి. శాస్త్రజ్ఞుల పరిశోధనకు కేంద్రం. కవుల ఊహలకు ప్రతిరూపం. పురాణాల్లో శాంతి సంకేతంగా, తేజోమయమైన దేవతగా వెలుగొందింది. ఇప్పుడు మానవ విజ్ఞాన సాధనకు మార్గదర్శకంగా నిలుస్తోంది. అంతర్జాతీయ చంద్ర దినోత్సవం మానవ శ్రమ, సంకల్పానికి ఘన నివాళిగా, భవిష్యత్ శాస్త్రీయ ప్రయాణాలకు ప్రేరణగా నిలుస్తోంది. ఇది మానవ జాతి ఏకత్వాన్ని, శాస్త్ర విజ్ఞాన శక్తిని, మరియు భవిష్యత్ స్వప్నాలను ప్రతిబింబించే వెలుగురేఖ. జూలై 20 చంద్ర దినోత్సవం కేవలం ఒక స్మారక రోజు కాదు %-% అది మానవత కోసం వెలిగే అక్షయ దీపం.

# భారీ కణితిని తొలగించిన వర్ధమాన్ మహావీర్ మెడికల్ కాలేజ్ సఫ్దర్ జంగ్‌హాస్పిటల్ వైద్య బృందం




ఢిల్లీ, జులై 20 సాధారణంగా ఒక వ్యక్తి కడుపులో చిన్న చిన్న పరిణామంలో కణితులు ఏర్పడడం సహజం. కానీ ఓ రోగి కడుపులో ఏకంగా 10 కిలోల కణితి ఏర్పడిందంటే మీరు నమ్ముతారా? అవును తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆస్పత్రికి రాగా, వైద్యులు శస్త్రచికిత్స చేసి భారీ పరిమాణంలో ఉన్న కణితిని తొలగించారు. ఈ అరుదైన సంఘటన ఢిల్లీలో జరిగింది. రోగి ప్రస్తుతం కోలుకుం టున్నాడని వైద్యులు తెలిపారు.

వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం, కొద్దిరోజులుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్న ఓ వ్యక్తి సఫ్దర్? జంగ్? హాస్పిటల్? వచ్చాడు. అతడిని పరీక్షించిన వైద్యులు కడుపులో ఏదో ఉందని గ్రహించారు. స్కానింగ్ చేయగా, కడుపులో భారీ కణితి ఉన్నట్లు తెలిసింది. వర్ధమాన్? మహావీర్ ?మెడికల్? కాలేజ్?(%ఎవీవీజ%), సఫ్దర్? జంగ్? హాస్పిటల్? వైద్య బృందం తీవ్రంగా శ్రమించి రోగి కడుపులోని 10.6 కిలోల జీర్ణశయాంతర కణితిని విజయవంతంగా తొలగించారు. గత సుమారు ఎనిమిది నెలల నుంచి రోగి ఈ సమస్యతో బాధపడుతున్నాడని వైద్యులు చెప్పారు. కణితి భారీ పరిమాణంలో ఉండడం వల్ల నడవడానికి కూడా ఇబ్బంది పడ్డినట్లు తెలిపారు. అయితే కణితితో శరీరంలోని మిగతా అవయవాలపై కూడా ప్రభావం చూపడం మొదలైందని చెప్పారు.

ఆ భారీ కణితిని తొలగించడం తమ వైద్య బృందం సాధించిన అతి పెద్ద విజయమని సఫ్దర్?జంగ్? హాస్పిటల్? డైరెక్టర్? డా. సందీప్? బన్సాల్? అన్నారు. ఇటువంటి సంక్లిష్ట సమస్యలకు అధునాతన శస్త్రచికిత్స నైపుణ్యాలు, సమన్వయం ఎంతో అవసరమన్నారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఇలాంటి కణితులను శస్త్రచికిత్స చేయకుండా వదిలేస్తే ప్రాణాలకే ప్రమాదమని అన్నారు.

ఈ రకం . జి ఐ ఎస్ టి లు జీర్ణాశయ పేగు మార్గంలో ఏర్పడే అరుదైన క్యాన్సర్? కణితులు అని వైద్యులు తెలిపారు. సాధారణంగా జి ఐ ట్రాక్ట్ గోడలోని ప్రత్యేక కణాల్లో ప్రారంభమవుతాయన్నారు. ప్రారంభంలో ఎలాంటి లక్షణాలు కనిపించకపోయినా, తర్వాత రోగి వాంతులు, రక్తస్రావం, కడుపు నొప్పి, వికారంతో బాధపడతారని వైద్యులు అంటున్నారు.

# ఒక తీపి అనుభూతికి అంకితమైన దినోత్సవం ౼ జాతీయ ఐస్‌క్రీమ్ దినం

## జూలై మూడవ ఆదివారం జాతీయ ఐస్‌క్రీమ్ దినం




వేసవి ఎండల్లో చల్లదనం కోరుకునే ప్రతి మనిషి హృదయంలో ఒకే ఒక్క మధురమైన ఆలోచన మెల్లగా ప్రవేశిస్తుంది ౼ ఐస్‌క్రీమ్. అది కేవలం రుచి కాదు%ొ% ఒక జ్ఞాపకం, ఒక చిరునవ్వు, ఒక తీపి అనుభూతి. చిన్నారుల కళ్లు మెరిపించే తీయదనం, యువత మధ్య మైత్రిని పెంపొందించే ఆహ్లాదకరమైన సందర్భం, కుటుంబాలలో ఒక అప్రతిమ బంధాన్ని నిర్మించే ఉత్సాహాన్నీ ఇది కలిగిస్తుంది. ఈ విశిష్టతకు గుర్తుగా ప్రతి సంవత్సరం జూలై మూడవ ఆదివారం జాతీయ ఐస్‌క్రీమ్ దినోత్సవం ఘనంగా నిర్వహించ బడుతోంది. ఈ సంవత్సరం అది జూలై 20, 2025 న జరుపు కుంటున్నారు.

ఐస్‌క్రీమ్ చరిత్రకు మనం గమనించే ప్రతి అడుగు విశేషమైనదే. క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దం నుంచే చైనాలో మంచుతో కలిపిన పండ్ల రసాన్ని ఆస్వాదించే సాంప్రదాయం ఉందని చరిత్ర చెబుతుంది. రోమన్ సామ్రాజ్యం లోనూ, పర్షియన్ రాజరికంలోనూ మంచుతో తీపి పదార్థాలను ఉపయోగించే వారట. అయితే ఆధునిక ఐస్‌క్రీమ్‌కు శాస్త్రీయ రూపం 16వ శతాబ్దం ఇటలీ నుంచే ఆవిర్భవించింది. చైనా నుంచి వచ్చిన తయారీ పద్ధతులను మార్కో పోలో ఇటలీకి పరిచయం చేశాడు. అక్కడి నుండి ఐస్‌క్రీమ్ రుచులు ఫ్రాన్స్, ఇంగ్లండ్ మీదుగా 18వ శతాబ్దంలో అమెరికా భూభాగంలోకి అడుగు పెట్టాయి.అమెరికాలో మొదటిసారిగా 1744లో ఐస్‌క్రీమ్ ప్రస్తావన లభించింది. 1790 నాటికి జార్జ్ వాషింగ్టన్ విందుల్లో దీన్ని ఉపయోగించాడన్న ఆధారాలు ఉన్నాయి. అయితే 1851లో జాకబ్ ఫస్సెల్ అనే వ్యాపారి వాణిజ్య పరంగా ఐస్‌క్రీమ్ తయారీ ప్రారంభించడంతో ఇది సామాన్యులకు కూడా అందుబాటులోకి వచ్చింది. అప్పటివరకు రాజ కుటుంబాలకు మాత్రమే పరిమితమైన ఈ తీయదనం, ప్రజల జీవితాల్లో ఒక భాగంగా మారిపోయింది.

ఈ నేపథ్యంతో, 1984లో అప్పటి అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రేగన్ జూలై మాసాన్ని “నేషనల్ ఐస్‌క్రీమ్ మంత్”గా ప్రకటించడమే కాదు, జూలై మూడవ ఆదివారం రోజున “నేషనల్ ఐస్‌క్రీమ్ డే”గా అధికారికంగా గుర్తింపు ఇచ్చారు. ఐస్‌క్రీమ్‌ను అమెరికన్ ప్రజల జీవనశైలిలో భాగమైన “సాంస్కృతిక మధురత”గా అభివర్ణించారు.

ప్రస్తుతం ఈ దినోత్సవాన్ని అమెరికాతో పాటు అనేక దేశాలలో, భారత దేశంలో కూడా ఎంతో ఉత్సాహంగా జరుపు కుంటున్నారు. ప్రముఖ బ్రాండ్లు ప్రత్యేక రుచులు, ఆఫర్లు, “బయ్ వన్ గెట్ వన్”, “రూ.1 లో స్కూప్”, “ఫ్లేవర్ సర్‌ప్రైజ్” వంటి ఆఫర్లతో వినియోగ దారులను ఆకర్షిస్తున్నాయి. సోషల్ మీడియాలో హ్యాష్‌ట్యాగ్‌తో వేలాది మంది తమ అనుభవాలను పంచు కుంటున్నారు.

ఐస్‌క్రీమ్ రకాలు అనేకం ౼ ఇటలీ గలాటో నుండి భారతీయ కూల్ఫీ వరకుబీ సాఫ్ట్ సర్వ్ నుండి ఫ్రోజెన్ యోగర్ట్ వరకూబీ చాక్లెట్ బైట్ నుండి పచ్చిమామిడి మజ్జిగ వరకూ. వెగన్ ఐస్‌క్రీమ్‌లు, డైరీ-ఫ్రీ, షుగర్ ఫ్రీ, ప్రొటీన్ ఐస్‌క్రీమ్‌లు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తయారవు తున్నాయి. ఇది ఆరోగ్యానికి హానికరమని చెప్పడంలో వాస్తవం ఉండక పోయినా, సరిఅయిన పరిమితిలో తీసుకుంటే ఐస్‌క్రీమ్ మానసిక ఆనందాన్ని కలిగించే టానిక్‌లా పనిచేస్తుంది.

ఇండియాలో ఈ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. 2023 నాటికి భారత ఐస్‌క్రీమ్ మార్కెట్ ?6,200 కోట్లను దాటి పోయింది. 5,000కి పైగా బ్రాండ్లు ౼ అమూల్, మదర్ డైరీ, నాచురల్స్, క్రీమ్‌బెల్లా, హెవెన్స్, హావ్‌మోర్ వంటివి విస్తృత స్థాయిలో వ్యాపారాన్ని చేస్తున్నారు. ఇప్పుడు ఐస్‌క్రీమ్‌ను కేవలం వేసవిలో కాకుండా, పండుగల, వేడుకల భాగంగా, లేదా రోజువారీ డెజర్ట్‌గా కూడా తీసు కుంటున్నారు.

పుట్టిన రోజులు, పెళ్లిళ్లు, ఫ్యామిలీ గెదరింగ్స్, పబ్లిక్ ఈవెంట్స్ ౼ ఏ సందర్భమైనా ఐస్‌క్రీమ్ లేకుండా పూర్తికాలేదు. ఇది చిన్నపిల్లల ముచ్చట్లలో ఆవిరైపోయే ఓ మజిలీ, ప్రేమికుల మధ్య పంచుకునే మధురత, వృద్ధుల నోట గుర్తొచ్చే బాల్యానుభూతి. ఒక్క స్కూప్ చల్లదనం మనసు లోనూ ఒక వెచ్చదనాన్ని కలిగించ గలదు. ఈ దినోత్సవాన్ని ప్రత్యేకంగా చేయడానికి మనం ఇంట్లోనే ఐస్‌క్రీమ్ తయారు చేయవచ్చు. పిల్లలతో కలిసి తీయదనాన్ని సృష్టించడం ద్వారా వారి మనో వైకల్యాలనూ పెంపొందించవచ్చు. స్వచ్ఛమైన పదార్థాలతో తయారైన ఐస్‌క్రీమ్‌లు ఆరోగ్యకరమై ఉంటాయి. యువత ఈ రంగంలో నూతన వ్యాపార అవకాశాలను పరిశీలించవచ్చు.

ఈ నేపథ్యంలో చెప్పదగ్గ విషయం ఒక్కటే ౼ ఐస్‌క్రీమ్ అనేది కేవలం తీపి పదార్థం కాదుబీ అది ఒక అనుభూతి, ఒక జీవనశైలి, ఒక బంధాన్ని, ఒక నవ్వును, ఒక జ్ఞాపకాన్ని కలిగించే మధురత. మన జీవితాల్లోని చిన్న ఆనందాలను గుర్తు చేస్తూ, వాటిని గౌరవించు కోవడం అనేది ఈ దినోత్సవం ద్వారా మనం నేర్చుకోవాల్సిన ముఖ్యమైన సందేశం.

ఈ జూలై 20న ౼ మనం చిన్నపిల్లలా నవ్వుతూ, కుటుంబంతో కలిసి ఒక స్కూప్ ఐస్‌క్రీమ్ తింటూ ౼ జీవితాన్ని మళ్లీ ఒకసారి తీపిగా ఆస్వాదిద్దాం.

# ఇండియా: మహిళలకు గౌరవం - మారుతున్న వాస్తవాలు, ఆందోళనలు, మరియు ప్రభుత్వ జోక్యం

భారతదేశం ఒక గొప్ప సాంస్కృతిక వారసత్వం కలిగిన దేశం. ఇక్కడ సతి అనసూయ తన భర్తను కాపాడేందుకు యమధర్మరాజును సవాల్ చేసింది. సీతాదేవి తన భర్త శ్రీరాముని వెంట వనవాసానికి వెళ్లడం ద్వారా ఆమె త్యాగాన్ని, ధైర్యాన్ని, భక్తిని చూపించింది.. భారత సంస్కృతిలో మహిళలకు ఎప్పటినుంచో ఉన్నత స్థానం, గౌరవభావం ఉన్నాయి. అయితే, ఇది ఒక వైపు మాత్రమే. ఈ మధ్యకాలంలో ఒక ఆందోళనకరమైన ధోరణి కనిపిస్తోంది ౼ ప్రత్యేకంగా వివాహ సంబంధాల్లో మహిళలు జరుపుతున్న హింసాత్మక నేరాలు పెరుగుతున్నాయి.

ఆందోళనకరమైన ధోరణి: మహిళల హింసాత్మక నేరాలు

అక్రమ సంబంధాలు, డబ్బు మరియు విలాసవంతమైన జీవితం పట్ల ఆకర్షణ, సోషల్ మీడియా, టీవీ సీరియల్స్, క్రైమ్ ఆధారిత షోలకు వ్యసనం వంటివి కొన్ని మహిళలను ప్రమాదకరమైన మార్గంలోకి తీసుకెళ్తున్నాయి. దాంతో అమాయక భర్తలు ౼ పెళ్లి అయిన కొన్ని రోజుల్లోనే-భయంకరంగాహత్య చేయబడు తున్నారు. ఈ తరహా నేరాలు దేశం నలుమూలలా వెలుగులోకి వస్తున్నాయి.

కొన్ని షాకింగ్ ఉదాహరణలు

మెఘాలయలో హనీమూన్ హత్య: సోనమ్ రఘువంశీ (25) తన భర్త రాజా రఘువంశీని హనీమూన్‌లో చంపించేందుకు కాంట్రాక్ట్ కిల్లర్లను అద్దెకు తీసుకున్నట్లు ఆరోపణ.

తెలంగాణలో తల్లి , కూతురు , కుట్ర: కర్నూల్‌లో ఒక యువతి, ఆమె తల్లి మరియు ఆమె ప్రియుడు కలిసి పెళ్లైన కొద్ది రోజుల్లోనే భర్త తేజేశ్వర్‌ను హత్య చేయాలని కుట్ర పన్ని హత్య చేసారు.

ఝూర?ండ్‌లో పెస్టిసైడ్ హత్య: గఢ్వా జిల్లాలో 19 ఏళ్ల భార్య, పెళ్లైన నెలరోజులకే తన భర్త బుద్ధనాథ్ సింగ్‌కు విషం కలిపిన చికెన్ తినిపించి హత్య చేసింది. హైదరాబాద్: తాడిలో నిద్రమాత్రలు: సైదాబాద్‌లో 45 ఏళ్ల మహిళ, తన భర్త తాడిలో నిద్రమాత్రలు కలిపి ఇచ్చినట్లు ఆరోపణ.

బెంగళూరు: భార్య, అత్త పాత్ర: లోకనాథ్ సింగ్ అనే వ్యక్తిని మత్తు మందులు ఇచ్చి, కంఠాన్ని కోసి హత్య చేసినట్లు అతని భార్య యశస్విని మరియు అత్తపై ఆరోపణలు వచ్చాయి.

ముంబయి: ప్రియుడితో కలిసి పథకం: రంజు చౌహాన్ తన ప్రియుడితో కలిసి భర్తను గొంతు ముక్కలుగా చేసి హత్య చేసింది.

జైపూర్: శరీరాన్ని తగలబెట్టిన ఘోరం: గోపాలీదేవి మరియు ఆమె ప్రియుడు తన భర్త ధన్నాలాల్ సైనీని హత్య చేసి, శరీరాన్ని తగలబెట్టే ప్రయత్నం చేశారు.

ఉత్తరప్రదేశ్ బిజ్నోర్: వలస నిరాకరణకు హత్య: శివాని అనే యువతి తన భర్త వలస వెళ్లడాన్ని నిరాకరించడమే కారణంగా మత్తు మందులు ఇచ్చి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఘటనలు కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే. మహిళలు చట్టబద్ధంగా అన్యాయాన్ని ఎదుర్కొన్న బాధితులుగా ఉన్నప్పటికీ, ఈ మధ్య హింసకు కారణమవుతున్న మహిళల పాత్రను కూడా సమాజం స్పష్టంగా గమనించాల్సిన అవసరం ఉంది. అయితే, స్పష్టంగా చెప్పాలి – అందరు మహిళలు ఇలా అనాగరికంగా ఉండరు, అలాగే అందరు పురుషులూ అమాయకులు కారు. మహిళలపై జరిగే గృహ హింస, పరువు హత్యలు, యాసిడ్ దాడులు వంటి నేరాలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. కానీ నిజమైన లింగ సమానత్వం అంటే రెండూ వైపుల న్యాయం జరగడం.సాంస్కృతిక నిజాయితీ మరియు నివారణ చర్యలు అవసరం

ఈరోజుల్లో సంబంధాలు సంక్లిష్టమైనవిగా మారుతున్నప్పుడు, తల్లిదండ్రులు మరియు కుటుంబాలు తమ పిల్లలతో పెళ్లి ముందు నిజాయితీతో సంభాషణలు జరపాల్సిన అవసరం ఉంది. ఎవరికైనా ప్రియుడు/ప్రేయసి ఉంటే, వారితోనే పెళ్లి జరగాలని ప్రోత్సహించాలి. అభిమతం లేని పెళ్లిళ్ల వల్ల అనేక జీవితాలు నాశనం అవుతాయి. పెళ్లి అనేది ఒప్పందం కాదు – అది జీవితాంతపు బాధ్యత. దానిని మోస పూరితంగామార్చితేఫలితాలు ప్రాణాంతకంగా ఉంటాయి.

మనమంతా గుర్తుంచుకోవాల్సిన విషయాలు

మహిళలను గౌరవించడం అంటే వారి నేరాలను క్షమించడం కాదు.

పురుషులను రక్షించడం అంటే మహిళలపై జరిగే నేరాలను విస్మరించడం కాదు.

న్యాయం ఎప్పుడూ సమానంగా, ధైర్యంగా, నిష్పక్షపాతంగా ఉండాలి.

ఈ క్లిష్టమైన సమస్యపై సమాజంలో మరింత అవగాహన, చర్చ జరగాలి. తద్వారా ఇలాంటి దారుణమైన నేరాలను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవచ్చు.

ప్రభుత్వ జోక్యం మరియు భవిష్యత్తు కార్యాచరణ

ఈ ఆందోళనకరమైన ధోరణిని నియంత్రించడానికి మరియు సమాజంలో లింగ సమానత్వాన్ని, న్యాయాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం సమగ్రమైన చర్యలు తీసుకోవాలి

:1. చట్టపరమైన సంస్కరణలు మరియు అమలు

కఠినమైన శిక్షలు మరియు వేగవంతమైన విచారణలు: మహిళలు పాల్పడే హింసాత్మక నేరాలపై వేగవంతమైన విచారణలు జరిపి, దోషులకు కఠినమైన శిక్షలు పడేలా చూడాలి.

సైబర్ నేరాలపై పటిష్ట నిఘా: సోషల్ మీడియా, ఆన్‌లైన్‌ప్లాట్‌ఫామ్‌ల దుర్వినియోగాన్ని అరికట్టాలి.

కుటుంబ చట్టాలపై అవగాహన: వివాహ వ్యవస్థ, విడాకుల చట్టాలపై ప్రజలకు సరైన అవగాహన కల్పించాలి.

2. సామాజిక మరియు విద్యాపరమైన కార్యక్రమాలు

విలువలతో కూడిన విద్య: పాఠశాల మరియు కళాశాల స్థాయి నుండే విద్యార్థులకు నైతిక విలువలు, సంబంధాలలో గౌరవం, బాధ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించాలి.

కౌన్సెలింగ్ కేంద్రాల ఏర్పాటు: వివాహ సమస్యలతో బాధపడుతున్న దంపతులకు ఉచిత కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

మానసిక ఆరోగ్య సేవల విస్తరణ: పెరుగుతున్న ఒత్తిడి, మానసిక సమస్యలు నేరాలకు దారితీయకుండా నిరోధించడానికి మానసిక ఆరోగ్య నిపుణుల సేవలను సులభతరం చేయాలి.

మీడియా పాత్రపై సమీక్ష: టీవీ సీరియల్స్, క్రైమ్ షోలు హింసను గ్లోరిఫై చేయకుండా, బాధ్యతాయుతమైన కంటెంట్‌ను ప్రసారం చేసేలా నిబంధనలను పటిష్టం చేయాలి.

3. పోలీస్ మరియు న్యాయవ్యవస్థలో సంస్కరణలు

పోలీస్ సిబ్బందికి శిక్షణ: గృహ హింస కేసులను, వివాహ సంబంధిత నేరాలను పరిష్కరించడంలో పోలీసులకు మరింత సున్నితమైన మరియు శాస్త్రీయమైన శిక్షణ ఇవ్వాలి.

ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు: ఈ తరహా కేసుల విచారణను వేగవంతం చేయడానికి ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలి. లింగ నిష్పక్షపాత విధానాలు: స్త్రీ, పురుషులు ఎవరైనా సరే, న్యాయవ్యవస్థ వారికి లింగ నిష్పక్షపాతంగా వ్యవ హరించేలా విధానాలను పటిష్టం చేయాలి .ప్రభుత్వం ఈ చర్యలను సమగ్రంగా అమలు చేయగలిగితే, సమాజంలో నేరాల సంఖ్యను తగ్గించడంతో పాటు, వివాహ వ్యవస్థపైప్రజలకు నమ్మకాన్ని పునరుద్ధరిం చవచ్చు. ఇది నిజమైన లింగ సమానత్వానికి పునాది వేస్తుంది.

**డా॥ కొండేరు రాఖేష్**





**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:**గోషామహల్ నియోజకవర్గంలోని గౌలీగూడ చమన్ మహంకాళి మందిరంలో బోనాల పండుగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ .రాజ్యసభసభ్యులు ఎంఅనిల్ కుమార్ యదవ్ ఈ సందర్భంగా శాలువాకప్పి సన్మానించిన కార్పోరేటర్ రాఖేష్‌జైస్వాల్ ,ఏఐసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ నిర్మల్ కుమార్‌యాదవ్

## అంబర్ పేట మహాకాళి ఆలయాన్ని సందర్శించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




అంబర్‌పేటలోని శ్రీ మహాకాళి ఆలయంలో జరుగుతున్న బోనాల జాతర సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదివారం ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సమేతంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ఉత్సవం శాంతియుతంగా, భక్తిభావంతో జరగాలని ఆకాంక్షించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి ఆయన ఉత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తో పాటు దేవస్థాన సేవా సమితి సభ్యులు కూడా పాల్గొన్నారు. కిషన్ రెడ్డి ఇవాళ మల్లేపల్లి కట్ట మైసమ్మ ఆలయం, కాచిగూడ నింబోలి అడ్డ మహంకాళి ఆలయం, హిమాయత్ నగర్ విఠలవాడి ముత్యాలమ్మ మహాంకాళి ఆలయం, మల్లేపల్లి ఎల్లమ్మ గుడి, కార్వాన్ లోని దర్బార్ మైసమ్మ తల్లి ఆలయం, మెహిదీపట్నం కనకదుర్గ ఆలయాలను సందర్శించారు. షేక్ పేట, ఇంద్రా నగర్, రహమత్ నగర్, యూసుఫ్ గూడ, బేగంపేట, చిలకలగూడ, బుద్ధ నగర్ తదితర ప్రాంతాల్లో జరిగిన బోనాల వేడుకల్లో పాల్గొన్నారు.

# స్వయం సహాయక మహిళా సమాఖ్యలకు ఆదర్శం

**రుణాల పంపిణీ.. రికవరీలో ఉత్తమ సేవలు ,సామాజిక రుగ్మతలు, సమస్యల పరిష్కారానికి కృషి**

**స్వయం ఉపాధి కల్పించడంలో విశేష కృషి**

**కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖా పతకానికి ఇల్లంతకుంట మండల ఆదర్శ సమాఖ్య ఎంపిక**

**ఆగస్టు 15న దేశ రాజధానిలో అవార్డు స్వీకరణకు ఆహ్వానం ,అభినందించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**






**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై - (ప్రజాబలం ప్రతినిధి)**స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందిస్తూ...రికవరీ చేస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్నది. మహిళల ఆర్థిక అభివృద్ధికి మద్దత్తుగా నిలుస్తూ... వారి ప్రగతిలో భాగమవుతున్నది. సామాజిక రుగ్మతలు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అవార్డ్ కు ఎంపిక అయిన ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్య పై ప్రత్యేక కథనం..

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలోని ఆదర్శ మండల సమాఖ్య 2004లో ఏర్పాటు అయింది. స్వయం సహాయక సభ్యులకు (ఎస్ హెచ్ జీ)లకు సేవలందిస్తోంది. ఈ మండల సమాఖ్య పరిధిలో 46 విలేజ్ ఆర్గనైజేషన్(వీఓ)లు ఉండగా, స్వయం సహాయక సంఘాలు 12,472 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఇప్పటి దాకా మొత్తం రూ. 59 కోట్ల రుణాలు పంపిణీ చేసింది. 99 శాతం రికవరీ చేశారు. దాదాపు రూ. 41,28,000 నిలువలతో మండల సమాఖ్య విజయవంతంగా కొనసాగుతున్నది.

ఇందిరా మహిళా శక్తి పథకం కింద...

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి కింద మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం రూ. కోటి ముప్పై లక్షల విలువైన స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయించారు. గేదెల పెంపకం, క్యాంటీన్లు, కుట్టు మిషన్లు, కోడి పిల్లల పెంపకం తదితర యూనిట్లు విజయవంతంగా కొనసాగుతున్నాయి.

ఆర్థిక, సామాజిక సేవలు అందిస్తూ..

ఆదర్శ మండల సమాఖ్య ఆధ్వర్యంలో గత ఐదేళ్లకు పైగా ఎస్ హెచ్ జీ సభ్యులకు రుణాలు అందించడం వాటిని క్రమం తప్పకుండా చెల్లించేలా చూడడం సభ్యులకు బీమా కల్పించడం తదితర సేవలు అందిస్తుంది. ఎస్ హెచ్ జీ సభ్యులు వివిధ వ్యాపారాల్లో రాణించేలా నిరంతరం శిక్షణ, సలహాలు అందిస్తున్నారు.

అదేవిదంగా సామాజిక బాధ్యత కింద అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, నీటి వనరుల సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగించవద్దని, సైబర్ మోసాలకు గురి కావద్దని, పల్స్ పోలియో, ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్మాణం తదితర అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులు జీవనోపాదులు పెంచే కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు.

22 క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్లు (సీ.ఎల్.ఎఫ్) ఎంపిక

దేశవ్యాప్తంగా ఉత్తమ సేవలందిస్తున్న మండల సమాఖ్యలకు అవార్డులు అందించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమాఖ్యల పనితీరును పరిశీలించారు. దీన్ దయాల్ అంత్యోదయ యోజన జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ లో భాగంగా ఉత్తమ సేవలు అందిస్తున్న మండల సమాఖ్య లను గుర్తించి ఆత్మ నిర్బర్ సంఘాతన్ అవార్డు 2024 ప్రధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి దేశవ్యాప్తంగా 22 మహిళా సంఘాలను ఎంపిక చేసింది.

అవార్డులకు దేశంలోని ఆరు రీజియన్ల పరిధిలో 22 క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్లు (సీఎల్ ఎఫ్)లు ఎంపిక కాగా.. సదరన్ రీజియన్ కింద రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండల ఆదర్శ సమాఖ్య రెండో స్థానంలో నిలిచి ప్రతిభ చూపింది. ఈ సందర్భంగా వారి సేవలను గుర్తిస్తూ కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖకు లేఖ అందింది. రానున్న ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోట వద్ద నిర్వహించనున్న అవార్డుల ప్రదాన ఉత్సవానికి రావాల్సిందిగా ఆహ్వానం అందింది. ఆదర్శ మండల సమాఖ్య బాధ్యులు అక్కడికి వెళ్లి అవార్డును స్వీకరించనున్నారు.

మహిళా సంఘాల సభ్యులకు కలెక్టర్ అభినందన..

ఇల్లంతకుంట మండలం ఆదర్శ మహిళా సమాఖ్య ఉత్తమ సేవలందించి జాతీయస్థాయి అవార్డుకు ఎంపికవడంతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి, అలాగే మండల సమాఖ్య బాధ్యులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేకంగా అభినందించారు. దీనికి కృషి చేసిన సభ్యులందరికీ అభినందనలు తెలిపారు.

నిరంతర ఆదాయానికి గ్యాస్ ఏజెన్సీ మంజూరు

ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్యకు నిరంతరం ఆదాయం వచ్చేలా గ్యాస్ ఏజెన్సీ మంజూరు చేయాలని డీఆర్డీఓ శేషాద్రిని కలెక్టర్ ఆదేశించారు. గ్యాస్ ఏజెన్సీతో మండల సమాఖ్య ఆర్థికంగా మరింత బలపడుతుందని పేర్కొన్నారు.

ఎస్.హెచ్.జీ రుణాలకు వడ్డీ తిరిగి చెల్లింపు

ఈనెల 17,18 తేదీలలో వేములవాడ అర్బన్ మండలంలోని 365 ఎస్ హెచ్ జీ లకు రూ. 46.84 లక్షలు, వేములవాడ రూరల్ మండలంలోని 442 ఎస్ హెచ్ జీ లకు రూ.58.81 లక్షలు, చందుర్తి మండలంలోని 613 ఎస్ హెచ్ జీ లకు రూ.82.50 లక్షలు, రుద్రంగి మండలంలోని 325 ఎస్ హెచ్ జీలకు రూ.41.61 లక్షలు, కోనరావుపేట మండలంలోని 910 ఎస్ హెచ్ జీ లకు రూ. 113. 32 లక్షలు, మొత్తం 2655 ఎస్ హెచ్ జీ లకు రూ. 3 కోట్ల 43 లక్షల వడ్డీ చెల్లించారు.

సిరిసిల్ల నియోజకవర్గంలోని తంగళ్ళపల్లి మండలంలోని 926 ఎస్ హెచ్ జీ లకు రూ. 124.40 లక్షలు, గంభీరావుపేట మండలంలోని 1004 ఎస్ హెచ్ జీ లకు రూ.141.34 లక్షలు, ముస్తాబాద్ మండలంలోని 1018 ఎస్ హెచ్ జీ లకు రూ. 138.68 లక్షలు, వీర్నపల్లి మండలంలోని 280 ఎస్ హెచ్ జీ లకు రూ.34.76 లక్షలు, ఎల్లారెడ్డిపేట మండలంలోని 1022 ఎస్ హెచ్ జీ లకు రూ.150.85 లక్షలు.. మొత్తం 4250 ఎస్ హెచ్ జీ లకు రూ. 5కోట్ల 90 లక్షల వడ్డీ పంపిణీ చేశారు.

బోయినపల్లి మండలంలోని 696 ఎస్ హెచ్ జీ లకు రూ. 98.90 లక్షలు, ఇల్లంతకుంట మండలంలోని 951 ఎస్ హెచ్ జీ లకు రూ.145. 51 లక్షల వడ్డీ చెల్లించారు. జిల్లాలోని మొత్తం 8552 ఎస్ హెచ్ జీలకు రూ. 11 కోట్ల 77 లక్షల 52 వేల వడ్డీ తిరిగి పంపిణీ చేశారు.

ఇందిరా మహిళా శక్తితో ఆదాయం

## బండారి స్వాతి, క్యాంటీన్ నిర్వాహకురాలు, ఇల్లంతకుంట



మాది ఇల్లంతకుంట. నాకు ఇద్దరు పిల్లలు. సంఘంలో చేరకముందు నా భర్త చేసే గీతా కార్మికుడు సంపాదనతో పిల్లల చదువు కుటుంబ పోషణ భారంగా ఉండేది. మూడేండ్ల క్రితం నా భర్త చనిపోయారు. నాకు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో ఏదైనా వ్యాపారం ప్రారంభించాలని ఇందిరా మహిళా శక్తి కింద బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.మూడు లక్షలు రుణం తీసుకొని క్యాంటీన్ ఏర్పాటు చేసుకున్న. ఫుడ్ ఆర్డర్ పైన అవసరమైన వారికి వండి ఆదాయం పొందుతున్న. రుణ వాయిదాలు చెల్లిస్తూ పిల్లలను చదివిస్తూ సంతోషంగా ఉన్న. ఆర్థిక తోడ్పాటు అందించిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులకు ధన్యవాదాలు.

రెండు నెలల్లో 70 వేల ఆదాయం..

## గొట్టం కవిత, కోడి పిల్లల పెంపకం కేంద్రం సోమారంపేట, ల్లంతకుంట మండలం



మాది ఇల్లంతకుంట మండలం సోమారంపేట. నేను సంఘంలో చేరక ముందు వ్యవసాయ కూలీ చేస్తూ బీడీలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్నాము. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు పొందుతూ కూతురు వివాహం చేసాను. నా భర్త నేను కలిసి పౌల్ట్రీ పారం కొరకు లింకేజీ శ్రీ నిధి, వీఓ నుంచి కలిపి రూ. 2.50,000 లక్షల రుణం తీసుకుని షెడ్ నిర్మించుకుని బాయిలర్ కోళ్లను పెంచాము. ఇందిరా మహిళా శక్తి కింద రూ.మూడు లక్షల రుణం తీసుకొని 2500 ఒకరోజు కోడి పిల్లలు తెచ్చి ఐదు వారాలు పెంచి మండలంలో విక్రయించడం ద్వారా రెండు నెలల్లో రూ.70 వేల ఆదాయం పొందాము. మళ్ళీ 2500 కోడిపిల్లలను పెంచుతున్నాము. తక్కువ రోజుల్లో ఎక్కువ ఆదాయం పొందుతూ సంతోషంగా జీవిస్తున్నాము. మాకు అభివృద్ధికి సహకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ సర్, అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

## సందీప్ కుమార్ ఝా, కలెక్టర్ రాజన్న సిరిసిల్ల.



ఆదర్శ మండల సమాఖ్య బాధ్యులు ఎస్ హెచ్ జీ సభ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా తీర్చిదిద్దేలా కృషి చేయాలి. మహిళలు వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెంది ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు నిరంతరం మహిళలకి మద్దతుగా ఉండాలి. మరింత మందికి ఉత్తమ సేవలు అందించి ఉన్నత స్థానాలకు ఎదగాలి.

# సినిమా





## రాహుల్ సిప్లిగంజ్ కు సీఎం రేవంత్ రూ. కోటి బహుమతి




తెలంగాణ బోనాల పండుగ వేళ హైదరాబాదీ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కు ప్రభుత్వం రూ. కోటి నజరానా ప్రకటించింది. దీనికి సంబంధించిన చెక్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కు అందించారు. రాష్ట్ర యువతకు రాహుల్ సిప్లిగంజ్ ఆదర్శనీయమని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి కొనియాడారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నటీనటులకు గద్దర్ ఫిలిం అవార్డ్స్ అందించిన విషయం తెలిసిందే. ఈ వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా రాహుల్ సిప్లిగంజ్ పేరును ప్రస్తావించారు.

రాహుల్ కు ప్రత్యేక అవార్డును ప్రకటించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే బోనాల పండుగ సందర్భంగా రాహుల్ సిప్లిగంజ్ కు ముఖ్యమంత్రి రేవంత్ రూ. కోటి నగదు పురస్కారం అందజేశారు. సొంత కృషితో ఎదిగిన రాహుల్ సిప్లిగంజ్.. ఆర్ఆర్ఆర్ సినిమా కోసం పాడిన 'నాటు నాటు' సాంగ్ ఆస్కార్ అవార్డును గెలుచుకున్న విషయం తెలిసిందే. మార్చి 2023 లో జరిగిన 95వ అకాడమీ అవార్డుల వేడుకలో ఈ పాటను ప్రదర్శించారు.

## పామును చేత్తో పట్టుకున్న నటుడు సోనూసూద్

**తమ సొసైటీలోకి వచ్చిన పామును స్వయంగా పట్టుకున్న సోనూసూద్**
**తాను పట్టుకున్నది విషపూరిత స్నేక్ కాదని, జెర్రిపోతు అని వెల్లడి**
**వీడియోను 'ఎక్స్' వేదికగా పంచుకున్న సోనూసూద్**




ప్రముఖ నటుడు సోనూ సూద్ తాను నివసించే సొసైటీ ఆవరణలో కనిపించిన పామును తన చేతులతో పట్టుకున్నారు. నటుడిగానే కాకుండా సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తాజాగా, పామును చేత్తో పట్టుకొని అందరినీ ఆశ్చర్యానికి గురిచేసి రియల్ హీరో అనిపించుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియోను ఆయన ఎక్స్ వేదికగా పంచుకున్నారు.

అది ర్యాట్ స్నేక్ (జెర్రిపోతు) అని, అది విషపూరితమైనది కాదని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో పాముల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాములు ఇళ్లలోకి ప్రవేశించినప్పుడు వాటిని పట్టుకునేందుకు నిపుణులను మాత్రమే పిలిపించాలని స్పష్టం చేశారు. అనంతరం వాటిని సురక్షితమైన ప్రాంతాల్లో వదిలిపెట్టాలని సూచించారు.

## ఏపీలో 'హరి హర వీరమల్లు' సినిమా టికెట్ ధరల పెంపు

**ఈ నెల 24న విడుదల కాబోతున్న 'హరి హర వీరమల్లు'**
**తొలి 10 రోజులు రేటు పెంచుకోవడానికి ఏపీ ప్రభుత్వం అనుమతి**
**తెలంగాణలో కూడా టికెట్ ధర పెంచుకోవడానికి అనుమతి లభించే అవకాశం**




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తాజా చిత్రం 'హరి హర వీరమల్లు' ఈ నెల 24న గ్రాండ్ గా రిలీజ్ కాబోతోంది. ఈ చిత్రంలో పవన్ సరసన నిధి అగర్వాల్ నటించింది. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వం వహించారు. ఏఎం రత్నం ఈ చిత్రాన్ని నిర్మించారు. మరోవైపు ఈ సినిమా టికెట్ ధరలను పెంచుకోవడానికి ఏపీ ప్రభుత్వం అనుమతించింది.

సినిమా విడుదలైన తొలి రెండు వారాల పాటు రేటు పెంచుకోవడానికి అనుమతించాలని చిత్ర నిర్మాత ప్రభుత్వాన్ని కోరారు. అయితే, తొలి 10 రోజులకు రేటు పెంచుకోవడానికి ప్రభుత్వం అనుమతించింది.

సింగిల్ స్క్రీన్ థియేటర్లలో లోయర్ క్లాస్ టికెట్ పై రూ. 100, అప్పర్ క్లాస్ టికెట్ పై రూ. 150 పెంచుకునేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మల్టీప్లెక్స్ లలో రూ. 200 వరకు పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది. అంతేగాకుండా, విడుదలకు ముందురోజు రాత్రి (జులై 23) పెయిడ్ ప్రీమియర్ షోకు కూడా అనుమతి మంజూరు చేసింది. ఈ ప్రీమియర్ షో టికెట్ ధర రూ.600.... జీఎస్టీ అదనం.

మరోవైపు తెలంగాణలో కూడా టికెట్ ధరలను పెంచాలని కోరుతూ ప్రభుత్వానికి నిర్మాత అర్జీ పెట్టుకున్నారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన చిత్రం కావడంతో తెలంగాణలో కూడా టికెట్ ధరల పెంపుకు అనుమతి లభించే అవకాశాలు ఉన్నాయి.

## నేను దళితుడినని తెలిసిన తర్వాత సినిమా అవకాశాలు తగ్గాయి: బాబు మోహన్

**సినీ పరిశ్రమలో కుల వివక్ష ఉందంటూ బాబు మోహన్ సంచలన వ్యాఖ్యలు**
**తాను దళితుడినని చాలా మందికి తెలియదన్న నటుడు**
**రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత తన కులం బయటపడిందని వెల్లడి**
**ఆ తర్వాత తనకు సినిమా అవకాశాలు తగ్గాయని ఆవేదన**




సీనియర్ నటుడు బాబు మోహన్ సినీ పరిశ్రమలో తన అనుభవాలపై తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను దళితుడినని తెలిసిన తర్వాతే తనకు సినిమా అవకాశాలు చాలా తగ్గిపోయాయని ఆయన అన్నారు. దీంతో బాబు మోహన్ వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. నటుడిగా, హాస్య నటుడిగా, సహాయ నటుడిగా ఇలా వందల సినిమాల్లో నటించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. ఆ తర్వాత రాజకీయల్లోనూ తనదైన ముద్ర వేశారు. అయితే, ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న బాబు మోహన్ సినీ పరిశ్రమలో కుల వివక్ష ఉందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

తాను దళితుడినని చాలా మందికి తెలియదని, ఈ విషయం తాను కూడా ఎప్పుడు బయటపెట్టలేదన్నారు. కానీ, ఎప్పుడైతే తాను రాజకీయల్లోకి ప్రవేశించిన తర్వాత నా కులం బయటపడిందో అప్పటి నుంచి బాబు మోహన్ దళితుడా? అంటూ కామెంట్లు వినిపించేవన్నారు. ఇదే కారణంతో నాకు వచ్చే సినిమా ఆఫర్లు తగ్గిపోయాయని తెలిపారు. తనను దూరం పెట్టడం మొదలుపెట్టారని, సినీ పరిశ్రమలో ప్రతిభకు బదులు కులానికే ప్రాధాన్యత ఉంటుందని బాబు మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు.



# వ్యాపారం




## 48 గంటల్లో 2 లక్షల ఆర్డర్లు.. సామ్‌సంగ్ ఫోల్డబుల్ ఫోన్‌కు డిమాండ్




న్యూఢిల్లీ, జూలై 19: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్ ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన ఫోల్డబుల్ ఫోన్‌కు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. కేవలం 48 గంటల్లోనే 2.1 లక్షలకు పైగా బుకింగ్‌లు వచ్చాయని పేర్కొంది. గెలాక్సీ జెడ్ ఫోల్డ్7, గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 7, గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 7 ఎఫ్ఈ స్మార్ట్‌ఫోనను ఏడో జనరేషన్‌గా విడుదల చేసింది. ఈ స్మార్ట్‌ఫోన్లు రూ. 89 వేలు మొదలుకొని రూ.2.11 లక్షల లోపు లభించనున్నాయి. వీటిలో జెడ్ ఫోల్డ్ 7 ప్రారంభ ధర రూ.1.75 లక్షలు కాగా, గరిష్ఠంగా రూ.2.11 లక్షలుగా నిర్ణయించింది. అలాగే గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 7 మాడల్ రూ.1.10 లక్షల నుంచి రూ.1.22 లక్షల లోపు లభించనున్నాయి. ఈ సందర్భంగా సామ్‌సంగ్ సౌత్‌వెస్ట్ ఆసియా ప్రెసిడెంట్, సీఈవో జేబీ పార్క్ మాట్లాడుతూ..దేశీయంగా తయారైన ఈ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌కు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.

## పర్యాటక ఖిల్లాకు మరో మణిహారం

### ములుగు మండలం ఇంచర్ల సమీపంలో గట్టమ్మ ఎకోపార్క్
### ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ సెంటర్ ఏర్పాటు
### 200 ఎకరాల్లో రూ. 2 కోట్లతో అభివృద్ధి
### 10 హెక్టార్లలో మిశ్రమ జాతి మొక్కల పెంపకం
### గత ప్రభుత్వ హయాంలో పడిన అడుగులు



పర్యాటక ఖిల్లాగా ప్రసిద్ధి గాంచిన ములుగు జిల్లాకు ఇంచర్ల సమీపంలో ఏర్పాటు చేస్తున్న గట్టమ్మ ఎకోపార్క్ మరో మణిహారం కానుంది. గత ప్రభుత్వ హయాంలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ నర్సరీ నిర్మాణంలో భాగంగా దీనికి అడుగులు పడగా, 200 ఎకరాల అటవీ భూమిని అధికార యంత్రాంగం గుర్తించింది. ఈ పనులు చేపట్టేందుకు అప్పటి సర్కారు రూ.1.50 కోట్ల ను అటవీ శాఖకు మంజూరు చేసింది.

ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 50 లక్షల కంపా నిధులు విడుదల చేసింది. ఇందులో భాగంగా 10 హెక్టార్ల విస్తీర్ణంలో 11,100 మిశ్రమ జాతి మొక్కల పెంపకాన్ని చేపట్టింది. అదేవిధంగా అటవీ జాతుల గురించి తెలియజేసేందుకు ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ సెంటర్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకుంది. 80 శాతం పనులు పూర్తి కాగా, ఆగస్టు 15 వరకు పార్క్‌ను ప్రారంభించేందుకు ఫారెస్టు శాఖ సిద్ధమైంది.

ఆదిదేవత గట్టమ్మ పేరు మీద ములుగు మండలం ఇంచర్ల సమీపంలోని ఎర్రి గట్టమ్మ వద్ద గట్టమ్మ ఎకో పార్క్‌ను అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 6 సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ నర్సరీలను జోన్‌ల వారీగా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూ పొందించింది. ఇందులో భాగంగా ములుగు జిల్లాలో సైతం మె గా నర్సరీని ఏర్పాటు చేసి కాళేశ్వరం జోన్‌లోని 6 జిల్లాలకు మొక్క లు సరఫరా చేసేందుకు నర్సరీ నిర్మాణానికి అధికారులు 2022 అక్టోబర్‌లో పనులు ప్రారంభించారు.

ఎర్రగట్టమ్మ దేవాలయం సమీపంలో ఉన్న కంపార్టుమెంట్ 544కు చెందిన 200 ఎకరాల అటవీ భూమిని అధికారులు గుర్తించి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ పనులు చేపట్టేందుకు అప్పటి ప్రభుత్వం రూ. కోటీ 50 లక్షల నిధులను అటవీ శాఖకు మంజూరు చేయగా నిర్మాణ పనులు చేపట్టారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొద్ది రోజుల వరకు పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారులు ప్రభుత్వానికి అవసరమైన నిధులకు ప్రతిపాదనలు పంపించగా 2024లో రూ. 50 లక్షల కంపా నిధులు విడుదల చేసింది. 200ఎకరాల విస్తీర్ణంలో గట్టమ్మ ఎకో పార్క్ పేరిట అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. 80 శాతం పనులు పూర్తి కాగా ఆగస్టు 15వ తేదీ వరకు పార్క్‌ను ప్రారంభించేందుకు ఫారెస్టు శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

## ఆర్ఎఫ్‌సీఎల్..షట్‌డౌన్ మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టుంది పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఫర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్) పరిస్థితి.

### ఆర్ఎఫ్‌సీఎల్..షట్‌డౌన్
### సాంకేతిక సమస్యతో మళ్లీ ఉత్పత్తికి బ్రేక్
### అమ్మోనియా పైప్‌లైన్ లీక్‌తో మళ్లీ మూత
### 25 రోజులవరకు యూరియా తయారీ డౌటే
### జెడ్ఎల్‌డీ లేకపోవడంతోనే తరచూ సమస్యలు
### ఇప్పటికే దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల లోటు



పెద్దపల్లి, జూలై 19 మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టుంది పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఫర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్) పరిస్థితి. అసలే దేశంలో యూరియా కొరత వేధిస్తున్న క్రమంలో తెలంగాణతో పాటు ఆరు రాష్ట్రాల్లో యూరియా సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆర్ఎఫ్‌సీఎల్ సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మళ్లీ మూతపడింది. ఈ నెల 16న అమ్మోనియా కనెక్టర్ పైప్‌లైన్ లీక్ కావడంతో ప్లాంట్‌ను షట్ డౌన్ చేశారు. మూడు రోజులుగా మరమ్మతులు చేపడుతున్నప్పటికీ ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. తిరిగి ప్లాంట్ అందుబాటులోకి రావడానికి కనీసం 20 రోజుల వరకూ సమయం పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

2025-26లో కేంద్ర, ఎరువులు రసాయనాల మంత్రిత్వ శాఖ 12.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. అయితే, ప్లాంట్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో ఈ ఏడాది మే 6న ప్లాంట్ షట్ డౌన్ చేసి, తిరిగి జూన్ 13న పునరుద్ధరించారు. జూన్‌లో 46,347.57 మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి జరిగింది. కర్మాగారంలో ఉత్పత్తి అయిన యూరియాలో ఏప్రిల్, జూన్ నెలలకు గాను రాష్ట్రానికి 30 శాతం మాత్రమే కేటాయించారు. మరింత యూరియా అవసరమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ ఇటీవలే కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ.. ప్రస్తుత షట్ డౌన్ కారణంగా అసలుకే మోసం వచ్చింది. దాదాపు 25 రోజుల వరకూ ఉత్పత్తి నిలిచిపోయే అవకాశం ఉండటంతో యూరియా మరింత కొరత ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జెడ్ఎల్‌డీ లేకపోవడం వల్లే ..

ఆర్ఎఫ్‌సీఎల్‌ను 2021లో రూ. 6,500 కోట్ల వ్యయంతో నిర్మించారు. మొత్తం ఈ ప్లాంట్ ద్వారా రోజుకు 3,850 మెట్రిక్ టన్నుల యూరియా, 2,200 మెట్రిక్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేయడమే లక్ష్యం కాగా, తరచూ సాంకేతిక సమస్యలు వెంటాడుతుండటంతో లక్ష్యాన్ని అందుకోలేకపోతున్నారు. ప్లాంట్ నిర్మించిన సమయంలోనే మిషనరీతో పాటు జీరో లిక్విడ్ డిశ్చార్జ్(జెడ్ఎల్‌డీ)ని సైతం నిర్మించాల్సి ఉండగా, దీనిని నిర్లక్ష్యం చేశారు. ఈ క్రమంలోనే తరచూ సమస్యలు అధికం అవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ జెడ్ఎల్‌డీ నిర్మాణానికి దాదాపుగా రూ.150 కోట్ల దాకా ఖర్చయ్యే అవకాశం ఉండగా, యాజమాన్యం వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తున్నది. దీనికి తోడు గ్యాస్ లీకేజీలు, ఎల్‌బో లీకేజీలు, అమ్మోనియా లీకేజీలతో షట్ డౌన్‌లు జరుగుతున్నాయి. దాదాపుగా 25 రోజుల వరకూ ఈ షట్ డౌన్ కొనసాగే అవకాశం ఉండటంతో 96,250 మెట్రిక్ టన్నుల యూరియా, 55 వేల మెట్రిక్ టన్నుల వరకు అమ్మోనియా ఉత్పత్తికి ఆటంకం కలిగే ప్రమాదం ఉన్నది. వ్యవసాయ అవసరాల సమయంలో ఉత్పత్తికి బ్రేకులు పడటంతో తెలంగాణతో పాటు మరో ఆరు రాష్ట్రాలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది.

రాష్ట్రానికి తగ్గిన కేటాయింపులు..

గత నెలలో తెలంగాణకు 30 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, అందులో సగం మాత్రమే 15,924.87 మెట్రిక్ టన్నులు సరఫరా చేశారు. ఒక వైపు ఉత్పత్తిలో ఇబ్బందులతో పాటు తెలంగాణకు ఇచ్చే యూరియా కోటాలో కేంద్ర ప్రభుత్వం తగ్గింపులు చేయడంతో కోటా తగ్గింది. ఈ విషయమై కేంద్ర రసాయనాల శాఖ మంత్రికి వినతులు సమర్పించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరతతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఇబ్బందికర పరిస్థితుల్లో ఆర్ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్ కావడం పట్ల రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్లాంట్‌లో సాంకేతిక సమస్యలతో ఈ ఏడాది కేటాయింపులకు తగ్గట్టుగా యూరియాను సరఫరా చేయలేకపోయారు. ఏడు రాష్ట్రాలకు 3,30,000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా 2,40,679మెట్రిక్ టన్నులు మాత్రమే పంపించారు. ఇంకా దాదాపుగా లక్ష మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉంది.

## బీఎండబ్ల్యూ 2 సిరీస్ గ్రాన్ కూపే గరిష్ఠ ధర రూ.49 లక్షలు



న్యూఢిల్లీ, జూలై 19: దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి బీఎండబ్ల్యూ తీసుకొచ్చింది. చెన్నై ప్లాంట్లో తయారైన బీఎండబ్ల్యూ 2 సిరీస్ గ్రాన్ కూపే దేశవ్యాప్తంగా ఉన్న డీలర్ల వద్ద ముందస్తు బుకింగ్ చేసుకోవాల్సి వుంటుందని సూచించింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు ధర రూ.46.90 లక్షల నుంచి రూ.48.90 లక్షల లోపు లభించనున్నది. ఈ ధరలు న్యూఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఈ కారుపై మూడేండ్లు లేదా 40 వేల కిలోమీటర్ల వరకు మెయింటెనెన్స్ వర్క్ ప్యాకేజీని అందిస్తున్నది.



# క్రీడలు



## నాలుగో టెస్టుకు ముందు భారత జట్టులో చేరిన అన్షుల్ కాంబోజ్

ప్రాక్టీస్ సెషన్‌లో గాయపడిన అర్షదీప్

అతడి స్థానంలో జట్టులో చేరిన అన్షుల్ కాంబోజ్

23న ప్రారంభం కానున్న నాలుగో టెస్టు

ఐదు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లండ్ 2-1తో ఆధిక్యం




ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌లో అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా తదుపరి జరగనున్న రెండు టెస్టుల కోసం హర్యానా పేసర్ అన్షుల్ కాంబోజ్ జట్టులో చేరాడు. తీవ్రంగా గాయపడిన లెఫ్టార్మ్ పేసర్ అర్షదీప్ స్థానంలో ఈ 24 ఏళ్ల పేసర్ ఆడనున్నాడు. అన్షుల్ ఇప్పటికే మాంచెస్టర్ బయలుదేరాడని, మిగతా రెండు మ్యాచుల్లో అతడు ఆడతాడని బీసీసీఐ తెలిపింది.

గురువారం నిర్వహించిన ప్రాక్టీస్ సెషన్‌లో సాయి సుదర్శన్ కొట్టిన బంతిని ఆపేందుకు ప్రయత్నించిన అర్షదీప్ తీవ్రంగా గాయపడ్డాడు. అర్షదీప్ ఇప్పటి వరకు టెస్టుల్లో అరంగేట్రం చేయనప్పటికీ, నాలుగో టెస్టులో ఎవరైనా పేసర్‌కు విశ్రాంతి కల్పిస్తే అతడి స్థానంలో అర్షదీప్‌ను బరిలోకి దింపాలని జట్టు నిర్ణయించింది. అయితే, ఇప్పుడతడు గాయపడటంతో ఆ స్థానాన్ని అన్షుల్‌తో భర్తీ చేయనున్నారు.


కాగా, భారత్-ఇంగ్లండ్ మధ్య నాలుగో టెస్టు మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో ఈ నెల 23న ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు జరిగిన మూడు టెస్టుల్లో భారత్ ఒక దాంట్లో విజయం సాధించగా, ఇంగ్లండ్ రెండు టెస్టులు గెలుచుకుని 2-1తో ముందంజలో ఉంది. ఈ నేపథ్యంలో నాలుగో టెస్టు కీలకంగా మారింది.

## భారత్ పరాజయం.. సిరీస్ సమం చేసిన ఇంగ్లండ్

లార్డ్స్ వేదికగా భారత్, ఇంగ్లండ్ మహిళల జట్ల మధ్య జరిగిన రెండో వన్డే

8 వికెట్ల తేడాతో(డీఎల్ఎస్) ఇంగ్లండ్ ఘన విజయం

మూడు మ్యాచ్‌ల సిరీస్ ప్రస్తుతం 1-1తో సమం




లార్డ్స్ వేదికగా భారత్, ఇంగ్లండ్ మహిళల జట్ల మధ్య జరిగిన రెండో వన్డేలో ఆతిథ్య జట్టు విజయం సాధించింది. పలుమార్లు వర్షం అంతరాయం మధ్య జరిగిన ఈ వన్డేలో ఇంగ్లండ్ 8 వికెట్ల తేడాతో(డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం) ఘన విజయాన్ని నమోదు చేసింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్ ప్రస్తుతం 1-1తో సమమైంది. మొదట టాస్ గెలిచిన ఇంగ్లండ్.. టీమిండియాను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌ను 29 ఓవర్లకు కుదించారు.

ఇక, తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు 8 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. టీమిండియాను కట్టడి చేయడంలో ఇంగ్లండ్ బౌలర్లు సఫలమయ్యారు. ఎకల్‌స్టోన్(3/27), అర్లాట్(2/26), లిన్సె స్మిత్(2/28) ధాటికి భారత్ స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. భారత ఇన్నింగ్స్‌లో స్మృతి మందన(42), దీప్తిశర్మ(30 నాటౌట్) రాణించారు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు.

కాగా, వర్షం అంతరాయంతో ఇంగ్లండ్ లక్ష్యాన్ని 24 ఓవర్లకు 115 పరుగులకు కుదించారు. ఈ టార్గెట్‌ను ఆతిథ్య జట్టు 21 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఇంగ్లండ్ బ్యాటర్లలో అమీ జోన్స్(46 నాటౌట్), టామీ బ్యూమౌంట్(34) బ్యాట్ ఝుళిపించారు. టీమిండియా బౌలర్లలో క్రాంతిగౌడ్, స్నేహ్‌రానా ఒక్కో వికెట్ తీశారు.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 29 ఓవర్లలో 143/8 (మందన 42, దీప్తిశర్మ 30 నాటౌట్, ఎకల్‌స్టోన్ 3/27, అర్లాట్ 2/26).

ఇంగ్లండ్: 21 ఓవర్లలో 116/2 (జోన్స్ 46 నాటౌట్, బ్యూమౌంట్ 34, స్నేహ్‌రానా 1/12, క్రాంతి 1/29).

## నాకు నా దేశమే ముఖ్యం.. పాక్‌తో మ్యాచ్ ఆడేది లేదని ఆరోజే చెప్పా: శిఖర్ ధావన్

వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్) 2025 టోర్నీ

టోర్నీలో భాగంగా ఇవాళ భారత్, పాక్ మధ్య జరగాల్సిన మ్యాచ్ రద్దు

పలువురు టీమిండియా మాజీ క్రికెటర్లు ఈ మ్యాచ్ ఆడేందుకు విముఖత

ఈ మేరకు డబ్ల్యూసీఎల్ నిర్వాహకుల ప్రకటన

తాను మే 11నే చెప్పానని.. పాక్‌తో మ్యాచ్ ఆడేది లేదన్న గబ్బర్




వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్) 2025లో భాగంగా ఈ రోజు భారత్, పాకిస్థాన్ మధ్య జరగాల్సిన మ్యాచ్ రద్దు అయింది. పలువురు టీమిండియా మాజీ క్రికెటర్లు ఈ మ్యాచ్ ఆడేందుకు విముఖత చూపడమే కారణమని డబ్ల్యూసీఎల్ నిర్వాహకులు వెల్లడించారు. శిఖర్ ధావన్, హర్భజన్ సింగ్, ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్ సహా పలువురు మాజీలు ఈ మ్యాచ్ నుంచి వైదొలిగారు.

దీంతో చేసేదేమీలేక నిర్వాహకులు మ్యాచ్‌ను క్యాన్సిల్ చేశారు. ఈ మేరకు తాజాగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఎడ్జ్‌బాస్టన్ స్టేడియం వద్దకు ప్రేక్షకులు ఎవరూ రావొద్దని, టికెట్ కొనుగోలు చేసిన వారికి డబ్బులు రీఫండ్ చేస్తామని నిర్వాహకులు తమ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, పాక్‌తో మ్యాచ్ ఆడేది లేదని తాను మే 11నే చెప్పానని గబ్బర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్టు చేసిన కొద్దిసేపటికే డబ్ల్యూసీఎల్ నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఇదిలాఉంటే.. 26 మంది పర్యాటకులను బలిగొన్న పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత మాజీ భారత క్రికెటర్లు పాకిస్థాన్‌తో పోటీ పడటంపై సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే.

నేను అప్పుడే చెప్పా.. పాక్‌తో మ్యాచ్ ఆడేది లేదని: గబ్బర్

పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో తాను పాల్గొనడం లేదని శిఖర్ ధావన్ తాజాగా ఎక్స్‌లో ధ్రువీకరించాడు. పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌కు సంబంధించి భారత జట్టు టోర్నమెంట్ నిర్వాహకులకు పంపిన మెయిల్ స్క్రీన్‌షాట్‌ను భారత మాజీ బ్యాట్స్‌మన్ షేర్ చేశాడు.

యువరాజ్ సింగ్ సారథ్యంలో టీమిండియా ఛాంపియన్స్ టోర్నీ బరిలోకి దిగింది. అయితే, తొలి మ్యాచ్ పాకిస్థాన్ ఛాంపియన్స్ తో కావడం గమనార్హం. అయితే, తాను ఈ మ్యాచ్ ఆడేది లేదని.. ఈ విషయాన్ని డబ్ల్యూసీఎల్ నిర్వాహకులకు తాను ఇప్పటికే చెప్పినట్లు గబ్బర్ వెల్లడించాడు. మే 11నే లీగ్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినట్లు మెయిల్ స్క్రీన్ షాట్లను ధావన్ పంచుకున్నాడు.

"జో కదమ్ మే 11 కో లియా, ఉస్పే ఆజ్ భీ వైసేహీ ఖడా హూన్. మేరా దేశ్ మేరే లియే సబ్ కుచ్ హై. ఔర్ దేశ్ సే బఢ్కర్ ఔర్ కుచ్ నహీ హోతా. (ఈ లీగ్‌లోని పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడకూడదని మే 11నే నేను నిర్ణయం తీసుకున్నా. నేను ఇప్పటికీ అదే నిర్ణయానికి కట్టుబడి ఉన్నా. నాకు నా దేశమే ముఖ్యం. దేశం కంటే ఏదీ గొప్పది కాదు)" అని శిఖర్ ట్వీట్ చేశాడు.

## దేశవాళీ సీజన్ కోసం బెంగాల్ జట్టులో మహ్మద్ షమీకి చోటు

గాయం కారణంగా ఇంగ్లండ్ పర్యటనకు దూరమైన షమీ

వచ్చే దేశవాళీ సీజన్ కోసం బెంగాల్ ప్రకటించిన 50 మంది సభ్యుల జాబితాలో చోటు

ఐపీఎల్ 2025 సీజన్ తర్వాత ఎలాంటి క్రికెట్ ఆడని పేసర్

పేసర్ మహమ్మద్ షమీ ఇటీవల తరచుగా గాయాలతో సతమతమవుతున్నాడు. ఇంగ్లండ్ టెస్టు సిరీస్ కు కూడా గాయం కారణంగానే అతడిని సెలెక్టర్లు పక్కనబెట్టారని వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో, రాబోయే 2025-26 దేశవాళీ సీజన్ కోసం బెంగాల్ ప్రకటించిన 50 మంది ఆటగాళ్ల జాబితాలో ఈ ఫాస్ట్ బౌలర్ చోటు దక్కించుకున్నాడు.

34 ఏళ్ల షమీ ఐపీఎల్ 2025 సీజన్ తర్వాత ఎలాంటి క్రికెట్ ఆడలేదు. ఈ ఏడాది సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించాడు. కానీ, అనుకున్న స్థాయిలో రాణించలేదు. ఇక, టీమిండియా తరఫున 2025 ఛాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగాడు. భారత జట్టు విజేతగా నిలవడంలో తనవంతు పాత్ర పోషించాడు. అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా వరుణ్ చక్రవర్తితో సమంగా నిలిచాడు. ఈ ఇద్దరూ టోర్నీలో తొమ్మిది వికెట్లు పడగొట్టారు.

2023 వన్డే ప్రపంచ కప్ లో గాయపడిన తర్వాత షమీ తన చీలమండకు సర్జరీ చేయించుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత కోలుకుని పునరాగమనం గట్టిగానే చేశాడు. రంజీ ట్రోఫీలో అతడు మధ్యప్రదేశ్‌పై ఆడిన బెంగాల్ ఆడిన మ్యాచ్‌లో 11 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో షమీ ఏడు వికెట్లు పడగొట్టడంతో పాటు కీలకమైన 37 పరుగులు చేసి, బెంగాల్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

ఆ తర్వాత 2024లో ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగు వైట్-బాల్ మ్యాచ్‌లలో ఆడటం ద్వారా 34 ఏళ్ల షమీ విజయవంతంగా జాతీయ జట్టులోకి తిరిగి వచ్చాడు. అయితే, ప్రస్తుతం జరుగుతున్న ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌కు తాను ఫిట్‌గా లేనని ప్రకటించడంతో షమీని ఎంపిక చేయలేదు. ఇప్పుడు రాబోయే దేశవాళీ సీజన్ కోసం బెంగాల్ జట్టులో షమీ చోటు దక్కించుకున్నాడు. ఆయనతో పాటు అభిమన్యు ఈశ్వరన్, ఆకాశ్ దీప్, ముఖేశ్ కుమార్, షాబాజ్ అహ్మద్, అభిషేక్ పోరెల్ వంటి కీలక ప్లేయర్లు బెంగాల్ విడుదల చేసిన 50 మంది సభ్యుల ప్రాబబుల్స్ జాబితాలో ఉన్నారు.




# ఆరోగ్యం



## ఫ్యాషన్ ప్రపంచంలో నయా ట్రెండ్!



'క్విట్ లగ్జరీ' గురించి మీరు ఎప్పుడైనా విన్నారా? ఒక్క మాటలో చెప్పాలంటే 'లగ్జరీ స్టేటస్'కు బదులుగా సింప్లిసిటీని ఫాలో అవడం. ఇటీవల సోషల్ మీడియా వేదికల్లో దీని గురించి చాలా మంది యువతీ, యువకులు డిస్కస్ చేస్తున్నారు. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా మార్క్ జుకర్ బర్గ్ లాంటి ప్రముఖులు కూడా ఈ సరికొత్త ఫ్యాషన్‌ను ఫాలో అవుతున్నారు. ఈ లేటెస్ట్ ట్రెండ్ మరింత విస్తరించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇన్నాళ్లు చాలా మంది ప్రముఖులు, సెలబ్రిటీలు ఖరీదైన బ్రాండెడ్ దుస్తులను ధరించాలని, తాము విలాసవంతమైన జీవితాన్ని గడిపే వారిగా గుర్తింపు పొందాలని ఆరాట పడేవారు. కానీ ఇటీవల పలువురిలో అభిప్రాయాలు మారుతున్నాయి. ఆర్థికపరమైన ఇబ్బందులు లేకున్నా, అనేక విషయాల్లో విలాసవంతమైన జీవన శైలిని కలిగి ఉన్నా దుస్తులు ధరించడంలో మాత్రం సింప్లిసిటీని అనుసరించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అంటే ధనవంతులు సాధారణ వ్యక్తులను ఫాలో అయ్యే సరికొత్త ధోరణి. 'క్విట్ లగ్జరీ' రీసెంట్ డెవలప్‌మెంట్ మూవ్‌మెంట్‌గా అనిపించవచ్చు కానీ ఇది గతంలో కూడా ఉండేదని, కాకపోతే చాలా తక్కువగా ఉండేదని పలువురు ఫ్యాషన్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దశాబ్దాలుగా వినియోగదారులు తమ వార్డ్‌రోబ్‌లో కొన్ని హై క్వాలిటీ పీసెస్ కలిగి ఉన్నప్పటికీ సింప్లిసిటీనే అనుసరించే వారు కూడా అరుదుగానైనా ఉండేవారట. కాకపోతే 2024లో రిచ్ అండ్ ఫేమస్ ఐటమ్స్ ప్రయారిటీని తగ్గించడం ద్వారా ప్రముఖులు కూడా ఈ నయా ట్రెండ్‌కు దగ్గరవుతున్నారు. దుస్తులు ధరించడంలో, ఫ్యాషన్ ఫాలోయింగ్‌లో బాహ్య సౌందర్యానికంటే మానసిక సౌందర్యానికి, మానసికి స్థితికే అధిక ప్రాధాన్యత ఇవ్వడం క్విట్ లగ్జరీలో ప్రముఖంగా ఉంటుంది. అయినప్పటికీ ఇక్కడ కొన్ని విజువల్ ఎలిమెంట్స్ కూడా ఉంటున్నాయి. ఉదాహరణకు న్యూట్రల్ కలర్స్, అలాగే స్ట్రీమ్ లైన్డ్ సిల్హౌట్స్ వంటి దుస్తుల ఎంపికకు ప్రయారిటీ ఇస్తున్నారు పలువురు. మరికొందరు క్విట్ లగ్జరీ అనేది కొన్ని నిర్దిష్టమైన బ్రాండ్‌లతో స్థిరమైన, నిజమైన రిలేషన్‌షిప్‌ను డెవలప్ చేయడం లాంటిదని కూడా అంటున్నారు. ఒక విధంగా ఇది యాంటీ ఫ్యాషన్‌గా, మల్టిపుల్ యూజ్‌గానూ ఉంటుంది. క్విట్ లగ్జరీ ఫ్యాషన్ కేవలం డిస్కషన్ వరకే పరిమితం కాలేదు. దీనికి రియల్ లైఫ్ ఎగ్జామ్‌పుల్స్ చాలానే ఉన్నాయి. ఉదాహరణకు మీరు ప్రపంచ ప్రసిద్ధి చెందిన సెలబ్రిటీలు గ్వినేత్ పాల్ట్రో, ఫేస్‌బుక్ సీఈఓ మార్క్ జుకర్ బర్గ్ వంటి వారిని గమనించారా? వీరు గొప్ప ధనవంతులే కావచ్చు. కానీ వారు ధరించే దుస్తులు, ప్రవర్తన సామాన్య వ్యక్తుల మాదిరే ఉంటుంది. లైఫ్ స్టైల్ చాలా సింప్లిసిటీగా అనిపిస్తుంది. జుకర్ బర్గ్ అయితే ఎక్కువగా ఒక గ్రే కలర్ టీ షర్టునే ధరిస్తుంటాడు. క్విట్ లగ్జరీలో ఫాస్ట్ ఫ్యాషన్ కంటే కూడా సౌలభ్యం, సౌకర్యం, మానసిక ఆనందం ప్రధాన అంశాలుగా ఉంటున్నాయని నిపుణులు చెప్తున్నారు. న్యూట్రల్ కలర్స్ కలిగిన సౌంకర్యవంతమైన దుస్తులను ఎంచుకోవడాన్ని చాలా మంది ఇష్టపడుతున్నారు. సింపుల్‌గా ఉండటం, ఒకే తరహా దుస్తులు, యాక్సెసరీస్, నగలు వంటివి ధరించడం క్విట్ లగ్జరీలో అంతిమ లక్ష్యంగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. ప్రస్తుతం దుస్తులకే పరిమితమైన ఈ ట్రెండ్ భవిష్యత్తులో అన్ని విషయాల్లోనూ విస్తరిస్తూ సింప్లిసిటీని ప్రతిబింబిస్తుందని పేర్కొంటున్నారు.

## మొబైల్ స్పీకర్‌లోకి వాటర్ వెళ్లాయా..



ప్రస్తుతం రాష్ట్రంలో రోజూ వర్షం పడుతున్న విషయం తెలిసిందే. అయితే ఎంత వర్షం పడినా మనం మన జాబ్ కోసం లేదా ఏదైనా పని మీద తప్పకుండా బయటకు వెళ్తాం. అయితే చాలా మంది వర్షంలో బయటకు వెళ్లినప్పుడు తమ స్మార్ట్ ఫోన్‌ను జాగ్రత్తగా చూసుకుంటారు. తాము తడిచినా మంచిదే కానీ, ఫోన్ మాత్రం తడవకూడదు అనుకుంటారు. కానీ కొన్ని సందర్భాల్లో మనకు తెలియకుండానే, ఫోన్‌లోకి వాటర్ వెళ్తాయి. మొబైల్ స్పీకర్‌లెరి వాటర్ వెళ్లడ జరుగుతుంది. ఇంకొన్ని సందర్భాల్లో పొలం పనులు చేస్తున్నప్పుడు ఫోన్ నీళ్లల్లో పడటం లేదా, చిన్నపిల్లలు ఫోన్‌ను తెలియకుండా నీళ్లలో పడేయడం జరగుతుంది. దీంతో మొబైల్ స్పీక్ హెూల్స్‌లోకివాటర్ వెళ్తాయి. దీంతో వాయిస్ వినబడకపోవడం, సాంగ్స్ , ఆడియో వినబడదు. దీంతో మీరు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారు. తితే అప్పుడు మనం ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. ఏ మొబైల్‌లోకి వాటర్ వెళ్లాయో, ఆ మొబైల్‌లో గూగుల్‌కి వెళ్లి, ఇట్స్ మై స్పీకర్ అని సెర్చ్ చేయాలి. ఫస్ట్ వచ్చిన వెబ్ సైట్ మీద క్లిక్ చేయాలి. దీంతో మీకు ఒక స్పీకర్ సింబల్ కనిపిస్తుంది. దీంతో మీరు దాని మీద ప్రెస్ చేయాలి. మీరు ప్రెస్ చేయగానే లౌడ్‌గా సౌండ్ వస్తుంది. దీంతో అక్కడి నుంచి వచ్చే సౌండ్‌కు మీ మొబైల్‌లో ఉన్న వాటర్ అన్నీ బయటకు వచ్చేస్తాయి. దీంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా మీ వినబడుతుంది.

## పాలిచ్చే తల్లులకు బిగ్ అలర్ట్..



అమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. తల్లి తన కడుపులో బిడ్డ పెరుగుతుందని తెలిసినప్పటి నుంచి ఆ బిడ్డ పెరిగి పెద్దది అయినా తన ఆరోగ్యం విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటుంది. ప్రెగ్నెంట్‌గా ఉన్నప్పుడు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటుంది. అంతే కాకుండా బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కూడా ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. ఎందుకంటే తాను తీసుకునే ఆహారం వలన బిడ్డకు ఎక్కడ అనారోగ్య సమస్యలు వస్తాయో అని ఆ తల్లి భయపడుతుంది. అయితే కొంత మంది ప్రెగ్నెన్సీ సమయంలో లేదా, బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత ఎక్కువ స్వీట్ తింటే బిడ్డకు షుగర్ వచ్చే ఛాన్స్ ఎక్కువగా ఉంటుంది. అందువలన స్వీట్స్ అస్సలు తినకూడదు అని చెబుతారు. కాగా, దీని గురించి ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.వైద్యుల సూచన ప్రకారం.. గర్భధారణ సమయంలో, బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కూడా మహిళా తప్పకుండా మంచి పోషకాహారం తీసుకోవాలంట. అంతే కాకుండా ఇద్దరికీ సరిపడా ఆహారం తీసుకున్నప్పుడే బిడ్డ, తల్లి ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారంట. లేకపోతే దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే ఛాన్స్ ఎక్కువగా ఉంటుందంట. అయితే కొంత మంది పాలిచ్చే తల్లులు, ప్రెగ్నెంట్ ఉమెన్స్ ఎక్కువగా స్వీట్స్, కూల్ డ్రింక్స్, జంగ్ ఫుడ్ తినడానికి ఇంట్రెస్ట్ చూపుతారు. కానీ దీని వలన శిశువులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. స్వీట్ ఎక్కువగా ఉన్న ఆహారాలు తీసుకోవడం వలన శిశువు ఊబకాయం, టైప్ 2 డయాబెటిస్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. అందుకే బాలింతలు, ప్రెగ్నెంట్ ఉమెన్స్ వారు తీసుకునే ఆహారం పట్ల చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు

## పడుకునే ముందు లైట్లు ఆర్పడం లేదా?



స్లీపింగ్ హాబిట్స్ అందరిలో ఒకేలా ఉండవు. ఒక్కొక్కరు ఒక్కో పద్ధతిని అనుసరిస్తుంటారు. చాలా మంది రాత్రిపూట లైట్లు ఆర్పేసి పడుకుంటారు. కొందరు బెడ్ లైట్లు వేసుకుంటే.. మరి కొందరు వేసుకోరు. ఇంకొందరు అసలు లైట్లే ఆర్పరు. అయితే లైట్లను ఆర్పకుండా పడుకోవడం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఓ అధ్యయనంలో వెల్లడైంది. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం పెరుగుతుందని నిపుణులు చెప్తున్నారు. అధ్యయనంలో భాగంగా ఆస్ట్రేలియాలోని ఫ్లిండర్స్ యూనివర్సిటీకి చెందిన రీసెర్చర్స్ రాత్రిళ్లు లైట్లు వేసుకొని పడుకోవడం కారణంగా ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలుసుకోవడానికి సుమారు 85 వేల మందిని, 9 ఏండ్ల పాటు స్టడీ చేశారు. అర్ధరాత్రి 12:30 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లైట్ల కాంతికి గురయ్యే వారిలో, అలాగే లైట్లు ఆర్పేసి పడుకున్న వారిలో ఎలాంటి ప్రాబ్లమ్స్ తలెత్తుతున్నాయో అబ్జర్వ్ చేశారు. దీంతోపాటు 13 మిలియన్ గంటలకు సంబంధించిన ఓవరాల్ లైట్ సెన్సార్ డేటాను కూడా ఎనలైజ్ చేశారు. అయితే దీర్ఘకాలం లైట్లు ఆర్పకుండా నిద్రిస్తున్న వారిలో టైప్ 2 డయాబెటిస్ త్వరగా డెవలప్ అయినట్లు ఈ సందర్భంగా పరిశోధకులు గుర్తించారు. కాంతికి ఎక్స్‌పోజ్ అవడంవల్ల సిర్కాడియన్ రిథమ్‌కు ఆటంకం కలగడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలం పాటు కాంతికి గురయ్యేవారిలో ఇన్సులిన్, గ్లూకోజ్ మెటబాలిజంలో మార్పులు సంభవిస్తాయని, ఇవి రక్తంలో షుగర్ లెవల్స్‌ను నియంత్రించే శారీరక సామర్థ్యాన్ని దెబ్బతీడంవల్ల టైప్ 2 డయాబెటిస్ పెరిగేందుకు కారణం అవుతాయని రీసెర్చర్స్ కనుగొన్నారు. కాబట్టి రాత్రిళ్లు లైట్లను ఆర్పేసి పడుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## బెల్లంతో చర్మ సౌందర్యం.. ఇలా చేస్తే నవ యవ్వనం మీ సొంతం..!



సాధారణంగా బెల్లం తీపి వంటకాల కోసం ఉపయోగిస్తారు కానీ మీకు తెలియని ఒక విషయం ఏమిటంటే బెల్లం చర్మ సమస్యలకు కూడా ఉపయోగపడుతుంది. అవును మీరు చదివింది నిజమే.. చర్మ సమస్యలను తగ్గించుకోవడానికి బెల్లం ఉపయోగపడుతుందని, ఇది ఎఫెక్టివ్‌గా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. చక్కెరకు ప్రత్యామ్నాయం బెల్లం. బెల్లంలో మినరల్స్, ఐరన్, పొటాషియం ఎక్కువగా ఉంటాయి. బెల్లంలో మినరల్స్, ఐరన్, పొటాషియం ఎక్కువగా ఉంటాయి. బెల్లం ఆరోగ్యానికి చాలా మంచిది. కేవలం ఆరోగ్యానికి మాత్రమే కాదు..బెల్లంతో చర్మం కూడా మెరుస్తుందట. బెల్లం ఉండే గ్లైకాలిక్ యాసిడ్ మాయిశ్చరైజర్ గా పనిచేస్తుంది. చర్మాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుతుంది. బెల్లం ఉండే గ్లైకాలిక్ యాసిడ్ మాయిశ్చరైజర్ గా పనిచేస్తుంది. చర్మాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుతుంది. గ్రాన్యుయల్స్ చర్మం మీద డెడ్ సెల్స్ ని తొలగిస్తుంది. చర్మాన్ని మృదువుగా మారుస్తుంది. గ్రాన్యుయల్స్ చర్మం మీద డెడ్ సెల్స్ ని తొలగిస్తుంది. ఇది ముఖంపై నల్ల మచ్చలు, మొటిమలను తగ్గించడంలో సహాయపడుతుంది. బెల్లం ముఖంపై ముడతలు, గీతలు, దురద వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఒక చెంచా బెల్లం తీసుకుని అందులో ఒక చెంచా తేనె, నిమ్మరసం కలిపి పేస్ట్ లా చేసి ముఖానికి రాసుకుని మర్దన చేసి ఐదు నిమిషాలు అలాగే ఉంచి కడిగేస్తే ముఖం మెరిసిపోతుంది. చర్మాన్ని మృదువుగా మారుస్తుంది. బెల్లంలోని యాంటీ ఆక్సిడెంట్స్, మినరల్స్, జింక్, సెలీనియమ్ ముఖంపై ముడతలు రానివ్వకుండా చేస్తుంది. ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ ప్రాపర్టీస్ మొటిమలు రాకుండా చేస్తుంది. చర్మంపై బ్యాక్టీరియాను తొలగిస్తుంది. రోజు బెల్లం తింటే.. బ్లడ్ సర్క్యులేషన్ పెరగుతుంది. దీంతో సెల్ టర్నోవర్ ఎక్కువ అవుతుంది. స్కిన్ బ్రైట్ అవుతుంది.బెల్లంలో ఉండే పోషకాల వల్ల ఎండలోకి వెళ్లినప్పుడు స్కిన్ పాడవ్వదు. అంతేకాదు, ఇందులో ఉండే మినరల్స్, విటమిన్స్ వల్ల దెబ్బ తగిలితే తొందరగా మానేలా చేస్తుంది.

# సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి ఆధ్యాపకులకు అవకాశం



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 20(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా:సదాశివపేట/ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సదాశివపేట యందు అతిథి ఆధ్యాపకులుగా బోధన కొరకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బోధన అవకాశం కల్పించారు,కంప్యూటర్ సైన్స్-1,ఇంగ్లీష్-1,కామర్స్-1,పొలిటికల్ సైన్స్-1,రసాయనశాస్త్రం-1,జువాలజీ-1,పై సబ్జెక్టులలో బోధన కొరకు పిజి-నెట్/సెట్/పి హెచ్ డి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరారు,అభ్యర్థులు తమ దరఖాస్తులను తేదీ: 22/07/2025 సాయంత్రం 4 గంటల వరకు కళాశాలలో ఇవ్వగలరని తెలియజేశారు. అతిథి అధ్యాపకులుగా దరఖాస్తులు కళాశాలలో ఇచ్చినటువంటి వారు తేదీ: 23/07/2025 నాడు తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డెమో మరియు ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కి రావాలని అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధాన అధ్యాపకులు జి బంగ్లా భారతి అన్నారు.

# కరెంట్ షాక్ తో నాలుగు జీవాలు మృతి అందోల్ మండలం అల్మాయపేట గ్రామంలో



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 20 (ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా: అందోల్ మండల పరిధిలో గల అల్మాయిపేట గ్రామంలో, కుమ్మరి సత్యనారాయణ రైతు గొర్రెలు మేపుతుండగా ప్రమాదవశాత్తు, కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే గొర్రెలు మేకలు మృతి చెందాయి, సత్యనారాయణ గొర్రెలు మేకలు మేపుకుంటూ ఉపాధి పొందుతున్నాడు, అయితే గొర్రెలు మేకలు మేపుతుండగా ఆకస్మాత్తుగా కరెంట్ షాక్ తగిలి, 60 వేల వరకు నష్టం జరిగిందని, సత్యనారాయణ ఆవేదన చెందుతూ, ప్రభుత్వం నన్ను ఆదుకోవాలని కోరారు, పంచాయతీ సెక్రెటరీ విషయం తెలుసుకొని సంఘటన స్థలానికి చేరుకొని, ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేటట్టు పై అధికారులకు, తెలియజేస్తానన్నారు...

# తెలంగాణ అస్తిత్వానికి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాల వేడుక.. సత్యం శ్రీరంగం

## అమ్మవారి ఆశీస్సులతో సమస్త మానవాళికి ఆనందం, శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాలను ప్రసాదించాలి...



**కూకట్పల్లి (ప్రజాబలం) జులై 20:**తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే బోనాల పండుగను పురస్కరించుకొని కూకట్ పల్లి నియోజకవర్గంలో మూసాపేట్, కూకట్ పల్లి, బాలాజీనగర్, అల్లాపూర్, బాలానగర్, ఫతేనగర్, బేగంపేట్ పలు డివిజన్ లలో శ్రీ శ్రీ చిత్తారమ్మ తల్లి, నల్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాలను భక్తి శ్రద్దలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆషాడ,శ్రావణ మాసాల్లో బోనాలు పండుగను తెలంగాణ ప్రజలు ఎంతో భక్తితో నిర్వహిస్తారని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ఒక ప్రతీక. అమ్మవారి దీవెనల కోసం బోనమెత్తే ప్రతి ఆడబిడ్డ హిందూ సంస్కృతికి నిజమైన వారసురాలు. ప్రజాప్రభుత్వం బోనాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తుందని, దేవాలయాలకు ఆర్థిక సహాయం కూడా చేసి బోనాలను అత్యంత ఆనందమయంగా నిర్వహించుకునేందుకు సహకరిస్తుందన్నారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా అమ్మవారి దీవెనలతో సుఖశాంతులతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో రామాలయం ఆలయ కమిటీ చైర్మన్ మాధవరం శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ పుష్పా రెడ్డి, బ్లాక్ అధ్యక్షులు పి. నాగిరెడ్డి, తూము వేణు, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, రాజు ముదిరాజ్, కంచి మహేందర్, పులిగోళ్ళ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు కుక్కల రమేష్ ముదిరాజ్, కృష్ణ రాజ్ పుత్, మధు గౌడ్, మొయినుద్దీన్, గంధం చంద్రశేఖర్, నరసింహ యాదవ్, పులి శివకుమార్ గౌడ్, గాజుల మహేష్ గౌడ్, బండారి నవీన్ గౌడ్, అరుణ్ గౌడ్, నరేష్, సప్పిడి భాస్కర్, ఆకుల నరేందర్, మధు మోహన్, రాజా మల్లయ్య, శేఖర్ గజానంద్, కనకయ్య, సుంకన్న, అనిల్ యాదవ్ బత్తుల, రాము గౌడ్, కుమార్ యాదవ్, భరత్ వంశీ, కలికోట శంకర్, మహేష్, బాలరాజ్, భరత్, మహిళా అధ్యక్షురాళ్లు రాధ, కృష్ణవేణి, సాయి భారతి, రవి ముదిరాజ్, పర్వేజ్, రాకేష్, అశోక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పలు ఆలయకమిటీ సభ్యులు,పెద్ద సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో పేద కుటుంబానికి బియ్యం వితరణ



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జూలై 20:**మందమర్రి బస్టాండ్ 21 పోలింగ్ బూత్ లో నివసిస్తున్న షేక్ మదర్ అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందగా ఆదివారం పట్టణ బిజెపి నాయకులు వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చెన్నూర్ బిజెపి కంటెస్టెంట్ ఎమ్మెల్యే దుర్గం అశోక్ మాతృమూర్తి కీర్తిశేషులు దుర్గం మంజుల జ్ఞాపకార్థంగా వారి కుటుంబానికి 25 కిలోల రైస్ బ్యాగ్ అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్, ఉపాధ్యక్షులు పోతునూరి రాజేందర్, ఉపాధ్యక్షులు గొల్లపల్లి ఓదెలు, సీనియర్ నాయకులు తుపాకుల శ్రీనివాస్, ఓం ప్రకాష్ లు పాల్గొన్నారు.

# మణికొండలో బోనాలకు హాజరైన కార్తిక్ రెడ్డి



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 20 జూలై 2025** మణికొండ మునిసిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ లోని పోచమ్మ తల్లి ఆలయ బోనాల ఉత్సవాల కార్యక్రమానికి హాజరయ్యిన రాజేంద్ర నగర్ బి.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జి, రాష్ట్ర యువ నాయకుడు కార్తిక్ రెడ్డి.

# అన్నదాత రైతన్న ఆవేదన నేటి యూవతకు రైతన్నల విజ్ఞప్తి




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి( జులై 20 ప్రజబలం )** సంగారెడ్డి జిల్లా: అందోల్ నియోజకవర్గం లోని, లైసెన్సు వైన్ షాప్ లే కాకుండా, గ్రామ గ్రామాన బెల్ట్ షాపులు వెలిశాయి, వీటిని అదుపు చేసే అధికారులే లేరు, ఎందుకంటే లంచాల మత్తులో మునిగిపోయి ఉన్నారు కాబట్టి, నేటి యువత ప్రతిరోజు ఏదో ఒకచోట, రహదారుల పక్కన, పొలాల మధ్య చెట్ల కింద, బీర్లు విస్కీలు తాగుతూ తాగిన మైకంలో బీరు సీసాలు పగలగొట్టి వ్యవసాయ పొలాల్లో విసిరేస్తున్నారు, మద్యం సేవించడం మితప్పు కాదు, ఎందుకంటే మీ సొంత ఖర్చులతో తాగుతున్నారు, (కానీ ఒక విషయం గమనించండి ) వర్షాలు బాగా పడడంతో రైతులు తమ పంట పొలాలను సాగు చేసుకుంటున్నారు, మీరు చేసే చిన్న తప్పు వల్ల, ఆ సీసా పెంకులు, రైతుల అరికాళ్ళకు గాని ఎద్దుల కాళ్లకు గాని, గుచ్చుకొని తెగి గాయమైతే ఎంత బాధగా ఉంటుందో మనకు తెలుసు, రైతన్నలు బాగుంటేనే వారు కష్టపడితేనే మనము మన భార్యా పిల్లలు బుక్కెడు బువ్వ తింటున్నాము, మిత్రులారా ఇది గమనించండి, ఈ పంట పొలాల్లో మీ తండ్రులే గాని మీ అక్క చెల్లెలు గాని వ్యవసాయ పనుల్లో పనిచేస్తూ ఉంటారు, మీరు చేసే చిన్న పొరపాటు వల్ల ఎంతమంది నష్టపోతారో ఒకసారి ఆలోచించండి, అందుకే మీకు మరొక్కసారి మనవి చేస్తున్నా, దయచేసి ఇలాంటి పొరపాట్లు ఇకముందు చేయకండి అని, ఓ రైతు ఆవేదనతో నేటి యువతకు విన్నవించు కుంటూ, చేతులెత్తి ప్రార్థిస్తున్నాడు.....

# పేకాట స్థావరంపై ఎల్లారెడ్డిపేట ఎస్సై ఆధ్వర్యంలో మెరుపు దాడి.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట, ( ప్రజాబలం),** ఆదివారం రోజున ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎల్లారెడ్డిపేట ఎస్సై రాహుల్ రెడ్డి సిబ్బందితో కలిసి మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా ఇద్దరు పరారయ్యారు. మిగిలిన ఇద్దరినీ అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రెండు మొబైల్ ఫోన్లు, ప్లేయింగ్ కార్డ్స్, తోపాటు రూపాయలు, 7,600/- నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఇద్దరినీ పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న వారి కోసం పోలీసుల గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి అని పేర్కొన్నారు.

# సింగూరు ప్రాజెక్టుకు స్వల్ప వరద



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జూలై 20 ప్రజాబలం )**సంగారెడ్డి జిల్లా : ఉమ్మడి మెదక్ జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టు అయినా సింగూరు ప్రాజెక్టు, రెండు మూడు రోజులుగా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి వరద ప్రవాహం పోటెక్కుతుందని, ప్రాజెక్టు పరిసరాల్లో 12 సెంటీ మీటర్ల వర్షం కురవడంతో, ఆ నీరంతా డ్యామ్ లోకి వచ్చి చేరుతుంది, ప్రాజెక్టులోకి శనివారం ఉదయం 2.658, క్యూసెక్కులు మధ్యాహ్నం 633, క్యూసెక్కుల ప్రవాహం వచ్చి చేరిందని, సింగూరు ప్రాజెక్టు ఏఈ,మహిపాల్ రెడ్డి, తెలిపారు, ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 29.917, టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో18.622, టీఎంసీల నీరు నిల్వ ఉందని, సింగూరు ప్రాజెక్టు నుంచి ఎడమ కాలువ ద్వారా పంటసాగుకు 60, క్యూసెక్కులు నీటిని, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై కి 80, క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 70,క్యూసెక్కులు, తలేల్మా లిఫ్ట్ ఇరిగేషన్ కు 33,క్యూసెక్కుల నీటిని వదులుతున్నామని తెలిపారు.....

# ఆది శ్రీనివాస్ కు వేసిన ఓట్లు, అభివృద్ధికి గేట్లు తెరిచాయి.

**దశాబ్దాలుగా నక్క వాగు పై బ్రిడ్జి లేక రెండు మండలాల ప్రజలు నరకయాతన అనుభవించారు.**
**గత ఎమ్మెల్యే ప్రొసీడింగ్స్ చూపిస్తూ ఓట్లు దండుకోవడంతో, వేసిన ఓట్లు నక్క వాగులో వేసినట్లే అయ్యింది.**
**గత ప్రభుత్వంలో ఆది నేతృత్వంలో బ్రిడ్జి కోసం ఎన్ని నిరసనలు చేసినా దున్నపోతు మీద వాన పడ్డట్లు అయ్యింది.**
**హనుమాజీపేట, బొల్లారం, లింగంపల్లి గ్రామ ప్రజల తరపున ప్రభుత్వ విప్ కు ధన్యవాదాలు.**
**డిసిసి కార్యదర్శి బాలసాని శ్రీనివాస్ గౌడ్.**



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** ఆదివారం రోజున వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా హనుమాజీపేటలోని నక్క వాగుపై హై లెవెల్ బ్రిడ్జ్ ఆవిష్కృతం కావడంతో నియోజకవర్గ ప్రజలు ఆది శ్రీనివాస్ కు వేసిన ఓట్లు అభివృద్ధి సంక్షేమలకు గేట్లు తీర్చాయనడానికి నిలువెత్తు నిదర్శమని డిసిసి కార్యదర్శి బాలసాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

దశాబ్దాలుగా నక్క వాగు పై బ్రిడ్జి లేక రెండు మండలాల పరిధిలోని ప్రజలు నరకయాతన అనుభవించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక అయినా నక్క వాగు తలరాత మారుతుందేమోనని కోటి ఆశలతో ఎదురు చూస్తే నాటి శాసనసభ్యులు రమేష్ చెన్నమనేని మూడు సార్లు గెలిచి ప్రొసీడింగ్స్ చూపిస్తూ ఓట్లు దండుకోవడంతో ప్రజలు వేసిన ఓట్లు నక్క వాగులో వేసినట్ల అయింది అన్నారు. 10 సంవత్సరాల నియంతృత్వ బి ఆర్ ఎస్ పాలనలో ఆది శ్రీనివాస్ నేతృత్వంలో బ్రిడ్జి నిర్మాణం కోసం ఎన్నో నిరసన కార్యక్రమాలు చేపట్టడం, ప్రభుత్వానికి విన్నవించడం జరిగింది కానీ దున్నపోతు మీద వాన పడ్డ చందంగా తయారైంది బిఆర్ఎస్ పాలనలో నిరాశ మిగిలింది అన్నారు. కానీ తదనంతరం జరిగిన శాసనసభ ఎన్నికలలో వేములవాడ ఎమ్మెల్యేగా నాటి పోరాటయోధుడు ఆది శ్రీనివాస్ ఉదయం సాధించడంతో వడ్డించేవాడు మనవాడైతే ఏ మూలన ఉన్న అన్న చందంగా నక్క వాగు బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం లభించింది అనడంలో అతిశయోక్తి లేదన్నారు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి ఆశీస్సులతో బ్రిడ్జి నిర్మాణం అయితే మరల నేడు ఆది శ్రీనివాస్ నేతృత్వంలో కావడం సంతోషదాయకం అన్నారు. ప్రజా పాలనలో ప్రజల ఆకాంక్షలు, అవస్థలు కేంద్ర బిందువుగా పనిచేస్తూ 18 నెలల్లో అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ నాయకుడు ఆది శ్రీనివాస్ అన్నారు. హనుమాజీపేట లోని నక్క వాగుపై హై లెవెల్ బ్రిడ్జి ప్రారంభించిన సందర్భంగా హనుమాజీపేట, బొల్లారం, లింగంపల్లి గ్రామ ప్రజల తరపున ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ప్రభుత్వ అధికారులు, మూడు గ్రామాల ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# హనుమాజీపేట నక్క వాగు పై నూతన బ్రిడ్జిని ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** ఆదివారం రోజున వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట గ్రామంలోని నక్క వాగుపై సుమారు 11.55 కోట్ల రూపాయలతో నిర్మించిన నూతన బ్రిడ్జిని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పాలకులు ఎమ్మెల్యే పదవిని హోదాకు చిహ్నంగా వాడుకుంటే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తాము మాత్రం ప్రజా సేవలో, అభివృద్ధిలో చిహ్నంగా వాడుకుంటున్నామని ఆయన వ్యాఖ్యానించారు. రాబోయే రోజులలో ప్రభుత్వం అమలు చేసే ప్రతిష్టాత్మక పథకాల్లో గ్రామానికి పెద్ద పీట వేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వకులాభరణం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మేక స్రవంతి, దైత కుమార్, డిసిసి కార్యదర్శి బాలసాని శ్రీనివాస్ గౌడ్, లింగంపల్లి మాజీ సర్పంచ్ సామ కవిత - తిరుపతి రెడ్డి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎల్లా గౌడ్, రూరల్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు ఆదిల్ పాషా, బొల్లారం మాజీ సర్పంచ్ మల్లేశం, సోషల్ మీడియా కోఆర్డినేటర్ చిలక ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇస్లామిక్ కరికులం పుస్తక పరీక్షకు ఉత్తీర్ణైన విద్యార్థులకు మజీద్ కమిటీ ప్రోత్సాహం



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై 20 (ప్రజాబలం ప్రతినిధి)**సిరిసిల్ల పట్టణంలోని ముస్లిం షాదీఖానాలో మజీద్ కమిటీ ఆధ్వర్యంలో జూన్ 25న ఇస్లామిక్ కరికులం అనే పుస్తక పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం రోజున, పరీక్ష లో ఉత్తీర్ణైన, విద్యార్థులకు మజీద్ కమిటీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్స్ బహుమతులు అందజేశారు. ఇస్లాం యొక్క పూర్తి పద్ధతిని పఠించిన పిల్లలకు కమిటీ వెయ్యి రూపాయలను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా మజీద్ కమిటీ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ సమీ మాట్లాడుతూ, పిల్లలకు ఇస్లాం బోధనలను పద్ధతులు ఆచారాలు, ఖురాన్ యొక్క విజ్ఞాన నేర్చుకోవాలని ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు మహమ్మద్ సలీం, షేక్ యూసుఫ్, సయ్యద్ సాదిక్, సయ్యద్ సమద్, సయ్యద్ జాంగిర్, సయ్యద్ అక్రమ్, సయ్యద్ సోహెల్ ,మునీర్ ,ఇంతియా, అంజద్, మజీద్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# వేములవాడలో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన వ్యవసాయ శాఖ అధికారులు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** ఆదివారం రోజున వేములవాడ పట్టణంలోని ఎరువులు మరియు పురుగు మందుల దుకాణ సముదాయాలను వేములవాడ వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా అందరూ డీలర్లు ఎరువుల యొక్క రికార్డ్స్ సక్రమంగా నమోదు చేయాలని, మరియు ఎరువుల యొక్క కృత్రిమ కొరత లేకుండా చూడాలని, రైతులకు ఎరువులు సక్రమంగా సరఫరా చేయాలని ఆదేశించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్, వ్యవసాయ విస్తరణ అధికారి రాజు పాల్గొన్నారు.



# షేక్ పేట్ ఫ్లై ఓవర్ పై గంటల తరబడి నిలిచిపోయాయిన వాహనాలు



హైదరాబాద్, జులై 20(భారత్ సమాచార్)షేక్ పేట్ ఫ్లై ఓవర్ పై గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి హైదరాబాదు నగరంలో రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది అందువల్ల హైదరాబాద్ షేక్ పేట్ ఫ్లైఓవర్ నుండి హైటెక్ సిటీ వైపు వెళ్లే మార్గం పూర్తిగా ట్రాఫిక్‌తో నిలిచిపోయింది. కేవలం రెండు గంటల వర్షం వల్ల నగరంలో రాకపోకలు స్తంభించాయి. ఒక్కసారి అక్కడి నుంచి వెళ్లే వాహనదారులు శతమతమయ్యారు చుట్టుపక్కల ఉండే వాళ్లు ఫ్లైఓవర్ బరువు ఏమవుతుందో అని భయపడ్డారు ఫ్లైఓవర్ లో రాకపోకలు వాహనాలు ఎక్కువ ఉంటాయి ఒకేసారి అలా నిలిచిపోవడం వల్ల కొద్దిగా గందరగోళంగా మారారు

# ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ల జిల్లా ఫోరం అధ్యక్షుడిగా చందుపట్ల రాజిరెడ్డి




**పరకాల నియోజకవర్గ ప్రతినిధి (ప్రజాబలం) జూలై 20 :** ఈరోజు నర్సంపేట మార్కెట్ నందు జరిగినటువంటి వరంగల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ల సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ మీటింగ్ లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మార్కెట్ కమిటీ చైర్మన్ లందరూ పరకాల మార్కెట్ చైర్మన్ అయినటువంటి శ్రీ చందుపట్ల రాజిరెడ్డి గారిని ఏకగ్రీవంగా ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ ఫోరం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది.

గౌరవ అధ్యక్షుడిగా గంట సంజీవరెడ్డి గారు ,
జనరల్ సెక్రెటరీగా బనుక శివరాజ్ గారు
, ఉపాధ్యక్షులుగా
రేగా కళ్యాణి గారు,రావుల హరీష్ రెడ్డి గారు, ఇస్లావత్ సుధాకర్ గారుకార్యదర్శిగా నల్ల ఆండాలు గారు ఎన్నిక కావడం జరిగినది

ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా చైర్మన్ ల ఫోరం అధ్యక్షుడు చందుపట్ల రాజిరెడ్డి గారు మాట్లాడుతూ తన ఎన్నికలకు సహకరించిన జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీల చైర్మన్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగినది,
వరంగల్ జిల్లాలోని మార్కెట్ ల యొక్క సమస్యలు పరిష్కారానికి మరియు అభివృద్ధి కొరకు అందరీ సహాయ సహకారాలు మరియు సూచనలు తీసుకుంటూ
సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటూ ముందుకు సాగుతానని తెలియజేయడం జరిగింది

ఈ కార్యక్రమంలో
నర్సంపేట చైర్మన్ పాలాయి శ్రీనివాస్ గారు,
కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి గారు
, జనగామ చైర్మన్ బనుక శివరాజ్ గారు,
చిట్యాల చైర్మన్ గుమ్మడి శ్రీదేవి గారు,
ఆత్మకూరు చైర్మన్ బీరంసునందా సుధాకర్ రెడ్డి గారు,
ములుగు చైర్మన్ రేగ కళ్యాణి గారు ,
స్టేషన్ఘన్పూర్ చైర్మన్ జూలకుంట్ల లావణ్య గారు
, మహబూబాబాద్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్ గారు,
నెక్కొండ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి గారు,
కొడకండ్ల చైర్మన్ నల్ల ఆండాలు గారు, పాలకుర్తి చైర్మన్ లావుడియ మంజుల గారు,
చర్యాల చైర్మన్ నల్ల నాగుల శ్వేత గారు,
తొర్రూర్ చైర్మన్ హనుమాన్ల తిరుపతి రెడ్డి
భూపాలపల్లి చైర్మన్ గుంటొజు కిష్టయ్య గారు
వర్ధన్నపేట వెంకటయ్య గారు
గారు పాల్గొనడం జరిగింది

# భీమేశ్వర ఆలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విప్ ఆది.







**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ పట్టణంలోని భీమేశ్వర ఆలయంలో 3 కోట్ల 44 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పాల్గొన్న రాజన్న ఆలయ ఈవో రాధాబాయి, వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ అధికారులు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్న ఆలయం కోడె మొక్కుల నిలయం. అత్యంత విశిష్టత కలిగిన దేవాలయం రాజన్న ఆలయం అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి, 8 మంది మంత్రుల సమక్షంలో రాజన్న ఆలయ అభివృద్ధికి గత ఏడాదిలో భూమి పూజ చేసుకున్నామని తెలిపారు.

అనేక రాష్ట్రాల నుండి వచ్చే రాజన్న భక్తులకు మెరుగైన వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

2023 బడ్జెట్లో 50 కోట్లు,24-25 బడ్జెట్లో 100 కోట్లు రాజన్న ఆలయం, పట్టణాభివృద్ధి కోసం కేటాయించడం జరిగిందని తెలిపారు.

వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ సూచనలు సలహాలతో ఇప్పటిక వేములవాడ పట్టణంలో రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపట్టినమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. దానికి 47 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు. నిర్వాసితులకు ఎలాంటి ఇబ్బందు తలెత్తకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

మొదటి దశలో 76 కోట్లతో వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి చేస్తున్నామని, శృంగేరి పీఠాధిపతుల, పరిరక్షణ కమిటీ వారి సలహాలు, సూచనలు, శాస్త్ర ప్రకారం అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

ఆలయ అభివృద్ధి విస్తరణకు ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయని తెలిపారు. ఆలయ విస్తరణ సమయంలో వచ్చే భక్తులకు దర్శనాలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ప్రాచీన ఆలయమైన భీమేశ్వర ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి చేస్తున్నామన్నారు.

పురాతన కాలం నుండి రాజన్న ఆలయానికి తోడుగా భీమేశ్వర ఆలయం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పురాణాల్లో చూసినట్లయితే శ్రీ రాజరాజేశ్వర స్వామిని ఇంద్రుడు, శ్రీరాముడు, పంచ పాండవులు వచ్చి దర్శనం చేసుకుని భీమేశ్వర ఆలయంలో వారి పూజ చేసినట్లుగా ఉంది అన్నారు.

భీమేశ్వర ఆలయాన్ని కూడా అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు.

రాజన్న ఆలయ విస్తరణ జరుగుతున్న సమయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భీమేశ్వరాలయంలో క్యూలైన్ల నిర్మాణం, అభిషేక మండపాలు, కళ్యాణ మండపాలు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.

3 కోట్ల44 లక్షల రూపాయలతో భీమేశ్వర ఆలయంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తామని, పనులు నెల రోజుల్లో పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. భీమేశ్వర్ ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భీమేశ్వర స్వామి, రాజన్న ఆశీస్సులు తీసుకొని నేడు శంకుస్థాపన చేశామన్నారు. వీలైనంత తొందరగా రాజన్న ఆలయ విస్తరణ చేపట్టి పనులు పూర్తి చేసి రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. రాజన్న భక్తులు, పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్న ఆలయ విస్తరణ అభివృద్ధి తొందర్లోనే మీ అందరి సహాయ సహకారాలతో పూర్తి చేస్తామన్నారు. వేములవాడ పట్టణం, రాజన్న ఆలయ అభివృద్ధి సమాంతరంగా చేస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుంది అన్నారు.

35 కోట్లతో వేములవాడ లో అన్నదాన సత్రం నిర్మాణం కోసం టెండర్లు పూర్తి అయ్యాయని, వేములవాడ రాజన్న ఆలయంలో 76 కోట్ల రూపాయలతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తయ్యాయి అని తెలిపారు. ప్రస్తుతం 150 కోట్లతో అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. వచ్చే సంవత్సరం బడ్జెట్లో కూడా నిధులు కేటాయింపు చేసుకొని దశలవారీగా రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. అందరి ఆలోచనలకు అనుగుణంగానే రాజన్న ఆలయ విస్తున్న అభివృద్ధి ఉంటుందన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ చేసే సమయంలో రాజన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అన్నారు. రాజన్న ఆశీస్సులు ప్రజల అందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

# జస్టిస్ యశ్వంత్ వర్మపై పార్లమెంట్ లో అభిశంసన తీర్మానం- ఇప్పటికే సంతకాలు పూర్తి



న్యూఢిల్లీ, జులై 20(భారత్ సమాచార్)జస్టిస్ యశ్వంత్? వర్మపై ఇంట్లో నోట్ల కట్టల కలకలం - కేసును సుమోటోగా తీసుకున్న సుప్రీం- ఇప్పటికే ఎంపీల సంతకాల సేకరణ పూర్తి- వర్షాకాల సమావేశాల్లో జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానం

ప్రస్తుతం దేశమంతా అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన గురించే చర్చించుకుంటున్నారు. ఇప్పటికే ఎంపీల సంతకాల సేకరణ కూడా ప్రారంభమైంది. ఈ వర్షాకాల సమావేశాల్లో జస్టిస్ వర్మ అభిశంసన తీర్మానం ప్రవేశపెడుతున్నారు. అయితే ఒక హైకోర్టు జడ్జిని తొలగించడం అంత సులువేమీ కాదు. దీనికి చాలా కఠిన ప్రక్రియ ఉంటుంది. అసలు ఈ ప్రక్రియ ఎలా జరుగుతుంది? ఎక్కడ జరుగుతుంది? ఇందులో ప్రభుత్వ జోక్యం ఉంటుందా? జడ్జీలను తొలగించే అధికారం ఎవరికి ఉంటుంది? రాజ్యాంగం ఏం చెబుతోంది? పూర్తి వివరాలు తెలుసుకుందాం.

ఈ ఏడాది మార్చి వరకు యశ్వంత్ వర్మ ఢిల్లీ హైకోర్టులో జడ్జిగా ఉన్నారు. మార్చి 14న జస్టిస్ వర్మ వెకేషన్‌కు వెళ్లగా ఆయన నివాసంలో అగ్ని ప్రమాదం జరిగింది. మంటలు ఆర్పేందుకు వచ్చిన ఫైర్ సిబ్బందికి ఆయన ఇంట్లో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయి. ఈ విషయాన్ని ఎవరికి చెప్పవద్దని జస్టిస్ వర్మ కుమార్తె వారికి చెప్పారు. అయినా విషయం బయటికి తెలిసింది. దీంతో ఈ విషయాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకుంది. వెంటనే సుప్రీంకోర్టు కొలీజియం ఆయన్ను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది. కానీ ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలు అప్పగించలేదు.కమిటీ ఏర్పాటు చేసిన సి జె ఐ

జస్టిస్ సంజీవ్ ఖన్నా

ఈ విషయంపై అప్పటి సి జె ఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా విచారణ కోసం కమిటీని నియమించారు. పంజాబ్, హరియాణా హైకోర్టు సి జె జస్టిస్ షీల్ నాగు , హిమాచల్ ప్రదేశ్ సి జె జస్టిస్ జీఎస్ సంధవాలియా, కర్నాటక హైకోర్టు సి జె అనుశివరామన్‌తో ఈ కమిటీ ఏర్పాటైంది. పదిరోజుల తర్వాత జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలు నిజమేనని కమిటీ రిపోర్టు నిర్ధరించింది. ఆ రిపోర్టు ఆధారంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా మే 8న ఆయనపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి లేఖ రాశారు. 25 పేజీల రిపోర్టు కాపీని ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ డి.కె ఉపాధ్యాయ సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఈ నివేదిక ఆధారంగా ప్రస్తుతం పార్లమెంట్‌లో జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేం దుకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం ఎంపీల సంతకాల సేకరణప్రక్రియను ప్రారంభించారు.

న్యాయమూర్తుల అభిశంసన ప్రక్రియ జడ్జెస్ ఎంక్వైరీ యాక్ట్- 1968 ప్రకారం జరుగుతుంది. ఈ ప్రక్రియ చాలా కఠినంగా, వివిధ దశల్లో ఉంటుంది. మొదటగా పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెడతారు. దీన్ని ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు. లోక్‌సభలో కనీసం 100 మంది సభ్యులు సంతకం చేసిన నోటీసును స్పీకర్‌కు ఇవ్వాలి. రాజ్యసభలో కనీసం 50 మంది సభ్యులు సంతకం చేసిన నోటీసును ఛైర్మన్‌కు ఇవ్వాలి. సంతకం చేసిన ఎంపీలను సంప్రదించి స్పీకర్ లేదా ఛైర్మన్ ఆ తీర్మానాన్ని ఆమోదించాలా? వద్దా? అనేది నిర్ణయించుకుంటారు. తీర్మానాన్ని ఆమోదించాక స్పీకర్ లేదా ఛైర్మన్ ముగ్గురు సభ్యుల విచారణ కమిటీని ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి లేదా భారత ప్రధాన న్యాయమూర్తి, ఏదైనా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఒక సీనియర్ న్యాయ నిపుణుడు ఉంటారు ,పార్లమెంటులో జరిగే ప్రక్రియ ఏమిటి?ఈ కమిటీ సదరు న్యాయమూర్తిపై వచ్చిన ఆరోపణలపై విచారిస్తుంది. సాక్ష్యాలను సేకరిస్తుంది. అంతేకాకుండా ఆ న్యాయమూర్తికి తన వాదనను వినిపించేందుకు అవకాశం కల్పిస్తుంది. విచారణ పూర్తైన తర్వాత, కమిటీ తన నివేదికను స్పీకర్ లేదా ఛైర్మన్‌కు సమర్పిస్తుంది. నివేదికలో న్యాయమూర్తిపై వచ్చిన ఆరోపణలు నిజమని తేలితే అభిశంసన తీర్మానాన్ని పార్లమెంటులో చర్చకు పెడతారు. చర్చ అనంతరం ఉభయ సభలు తీర్మానాన్ని ప్రత్యేక మెజారిటీతో ఆమోదించాలి. అంటే సభకు కనీసంగా 50 శాతం మంది హాజరవ్వాలి. అందులో మూడింట రెండొంతుల మెజారిటీ ఓట్లు పడితే ఆ సభలో తీర్మానం ఆమోదం పొందుతుంది. తర్వాత, తీర్మానాన్ని మరొక సభకు పంపుతారు. అక్కడా ప్రత్యేక మెజారిటీతో ఆమోదం పొందాల్సి ఉంటుంది. రెండు సభలు తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత దాన్ని రాష్ట్రపతికి పంపిస్తారు. రాష్ట్రపతి అప్పుడు ఆ న్యాయమూర్తిని పదవి నుంచి తొలగించడానికి ఆదేశాలు జారీ చేస్తారు. ఈ అంశంలో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదు. ఇది పూర్తిగా పార్లమెంటులో జరిగే ప్రక్రియ.జస్టిస్ వర్మ విషయంలో సుప్రీంకోర్టు సుమోటోగా కమిటీ ఏర్పాటు చేసింది. ఆ కమిటీ రిపోర్టు మా దృష్టికి వచ్చింది. లోక్‌సభ, రాజ్యసభలో చర్చ జరుగుతుంది. 100 మంది లోక్‌సభలో సంతకం చేసి ఇస్తే స్పీకర్ ఆయన పని మొదలుపెడుతారు. రాజ్యసభలో 50 మంది చేసి ఇస్తే అక్కడ పని మొదలవుతుంది. అప్పుడు దానిపై చర్చ జరుగుతుంది. ఈ విషయంలో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదు. అని అర్జున్ రామ్ మేఘ్‌వాల్, కేంద్రమంత్రి అన్నారు ఇతర పార్టీలు ఈ అభిశంసనకు మద్దతు ఇస్తున్నాయా?

ఈ విషయంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పష్టత నిచ్చారు. కాంగ్రెస్ సహా అన్ని పార్టీల నాయకులతో ఈ అంశంపై మాట్లాడానని తెలిపారు.

నేను ఇప్పటికే అందరిని సంప్రదిం చాను. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన సీనియర్ నేతలతో మాట్లాడా. సింగిల్ ఎంపీ ఉన్న పార్టీలతోనూ టచ్‌లోకి వెళ్లా. ఎందుకంటే ఎవరినీ విస్మరిం చాలని నేను అనుకోలేదు. అందు వల్ల ఈ విషయంలో ఇప్పుడు భారత పార్లమెంటు ఏకతాటిపైకి వచ్చింది. అవును. కాంగ్రెస్ కూడా అర్థం చేసుకోవడం సంతోషంగా ఉంది. అది కచ్చితంగా జరగాలి. ఎందుకంటే ఏ పార్టీ కూడా అవినీతికి పాల్పడిన న్యాయ మూర్తికి మద్దతివ్వడం కానీ, కాపాడటం కానీ చేయదు. అని కిరెణ్ రిజిజు, కేంద్రమంత్రి అన్నారు ు కాంగ్రెస్ ఎంపీలు ఏమం టున్నారు? జస్టిస్ వర్మ విషయంలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు కనిపిస్తోంది. ఈ విషయంలో పూర్తిస్థాయి దర్యాప్తు జరగాల్సిందేనని ఎంపీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా స్పష్టం చేశారు. మేం మద్దతిస్తున్నాం. ఈ తీర్మానంపై మా ఎంపీలు కూడా సంతకం చేస్తున్నారు. జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలు చాలా తీవ్రమైనవి. దీనిపై గతంలో సి జె ఐ ముగ్గురు సీనియర్ న్యాయమూర్తులతో కమిటీ కూడా వేశారు. అంతేకాదు, ప్రధానికి, రాష్ట్రపతి లేఖ కూడా రాశారు. మేం కూడా తప్పకుండా సంతకం చేస్తాం. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరగాలి.అని జైరాం రమేశ్, కాంగ్రెస్ ఎంపీ అన్నారు,ు

భారత్‌లో 1993లో జస్టిస్ రామ స్వామి అభిశంసన ఎదుర్కొన్న మొదటివ్యక్తిగా నిలిచారు. ఆయనపై లోక్‌సభలో తీర్మానం ప్రవేశపెట్టినా 2/3 మెజారిటీ పొందని కారణంగా వీగిపోయింది. 2011లో కోల్‌కతా హైకోర్టు జడ్జిగా ఉన్న జస్టిస్ సౌమిత్రి సేన్ రాజ్యసభ తనపై తీర్మానం పెట్టినందుకు ఆయనే స్వయంగా రాజీనామా చేశారు. ఎగువసభలో అభిశంసన ఎదుర్కొన్న మొదటి వ్యక్తిగా ఆయన నిలిచారు. 2011 జులైలో సిక్కిం హైకోర్టు సి జె జస్టిస్ పి.డి దినకరన్‌పై అవినీతి ఆరోపణలు వచ్చాయి. భూకబ్జాలు, న్యాయాధి కారాల దుర్వినియోగం చేశారని రాజ్యసభ ఛైర్మన్ లీగల్ ప్యానెల్ ఏర్పాటు చేశారు. ఆయనపై అభిశంసన ప్రక్రియ ప్రారంభం కాకముందే రాజీనామా చేశారు. 2015లో జస్టిస్ జె బి పార్థీవాలా, 2017లో జస్టిస్ సి వి నాగార్జున రెడ్డి, 2018లో జస్టిస్ దీపక్ మిశ్రాపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే ఇవన్నీ వీగిపోయా యి. ప్రస్తుతం జస్టిస్ వర్మపై పెట్టిన తీర్మానానికి ఆమోదం లభించి తొలగిస్తే భారత చరిత్రలో అభిశంసన ద్వారా తీసేసిన తొలి న్యాయమూర్తి అవుతారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com